సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 27-9-2024 15/-


## మైనారిటీ రిపోర్ట్

### అశ్లీలతకు వ్యతిరేకంగా ఓ గొప్ప ఉద్యమం అవసరం



### జనాభా పెరుగుదల వరమా- శాపమా?

సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 39 హైదరాబాద్
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 రూ.15-00
23 రబీఉల్ అవ్వల్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

**మీలో తన భార్య యెడల ఉత్తముడైన వాడే మేలైన వాడు, మంచితనం గలవాడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





## లోపల...


| | | |
|---|---|---|
| పేజర్ టెర్రరిజం | ...... | 04 |
| మైనారిటీ రిపోర్ట్ | ...... | 05 |
| ప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధనల వెలుగులో (రిపోర్టు) | ...... | 07 |
| దేవుని బెబ్బులి!! – 47 | ...... | 08 |
| చరితార్థులు–2 : సయ్యద్ పీర్ సిబ్గతుల్లాహ్ షాహ్ రషాది | ...... | 11 |
| 'విశ్వాసం' కోరే లక్షణాలు | ...... | 12 |
| అశ్లీలతకు వ్యతిరేకంగా ఓ గొప్ప ఉద్యమం అవసరం | ...... | 14 |
| మనిషిలోని మనసు మూడు దశలు | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| వెలుతురు సూర్యుడు మహాప్రవక్త (స) | ...... | 22 |
| జనాభా పెరుగుదల వరమా–శాపమా? | ...... | 24 |
| మహనీయ ముహమ్మద్ (స) వారి ప్రత్యేకతలు | ...... | 26 |
| అమ్మో ఒకటో తారీకు | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| దైవప్రేమ, ప్రవక్త ప్రేమ విడదీయరానివి | ...... | 33 |


**నైతికత, స్వేచ్ఛ ...**




ఓ వైపున స్వతంత్రత
మరొక వైపు నైతికత
మానతకు వ్యతిరేకం
మితిమించిన స్వేచ్ఛ!
స్వతంత్రత పేరుతో
కాకూడదోయి రచ్చ
క్యారెక్టర్‌పై ఎన్నడు
పడకూడదు మచ్చ!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# పేజర్ టెర్రరిజం

సెప్టెంబర్ 17వ తేదీన లెబనాన్‌లో అనేక పేజర్లు పేలిపోయి దాదాపు 3000 మంది గాయపడ్డారు. దాదాపు పదిమంది మరణించినట్లు తెలుస్తోంది. ఇందులో హిజ్బుల్లాకు చెందిన వారు కూడా ఉన్నారని వార్త. హిజ్బుల్లా ఇస్రాయీల్ మధ్య యుద్ధం గురించి అందరికీ తెలిసిందే.

లెబనాన్‌లో సిగ్నల్ సమస్య వల్ల టవర్ల సమస్యల వల్ల ఇప్పటికీ చాలా మంది పేజర్లు వాడుతున్నారు. మొబైల్ ఫోన్లు వాడితే లొకేషన్ పట్టుబడే అవకాశం ఉంది కాబట్టి హిజ్బుల్లా మిలిటెంట్లు కూడా పేజర్లు వాడుతున్నారు. హిజ్బుల్లా లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో అనేకమంది అమాయకులు బలయ్యారు. ఇస్రాయీల్ ఈ దాడికి పాల్పడిందని హిజ్బుల్లా ఆరోపించింది. హిజ్బుల్లా తైవాన్‌కు చెందిన కంపెనీ నుంచి కొనుగోలు చేసిన పేజర్లలో ఇస్రాయీల్ గూఢచార సంస్థ ద్వారా తక్కువ మొత్తంలో అంటే దాదాపు 3 గ్రాముల పేలుడు పదార్థం పెట్టిందని, దానివల్లనే పేలుళ్ళు జరిగాయని తెలుస్తోంది. ఇలాంటి దాడులు చేయడం ఇస్రాయీల్‌కు కొత్త కాదు. కాని పేజర్లలో బాంబులు పెట్టడం ఉగ్రవాద చర్య కాదా? ఇది యుద్ధమా? గాజాలో అమాయక పౌరులను, పిల్లలను, మహిళలను బాంబులతో చంపే దేశం, స్కూళ్ళపై బాంబులు వేసే దేశం, ఐక్యరాజ్య సమితి అధికారులను చంపించే దేశం ఇలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడడంలో ఆశ్చర్యమేమీ లేదు. కాని ఇది యుద్ధంలో భాగంగా మాత్రమే జరిగిందన్నట్లు, ఇది ఉగ్రవాద చర్య కాదన్నట్లు మీడియా వ్యవహరించడం విచిత్రం.

ప్రస్తుత గ్లోబల్ విలేజ్ కాలంలో సప్లయ్ చైన్లు చాలా సంకీర్ణంగా ఉన్నాయి. మొబైల్ ఫోన్లు ఇతర డిజిటల్ పరికరాలను దిగుమతి చేసుకోవడం ప్రతిచోటా జరుగుతూనే ఉంటుంది. ఇలాంటి నేపథ్యంలో ఈ పరికరాల్లో ఉద్దేశ్యపూర్వకంగా పేలుడు పదార్థాలు పెట్టించడం ద్వారా భయోత్పాత స్థితి సృష్టించే ఈ పరిస్థితి చాలా భీతావహకమైనది. ఇలాంటి చర్యలను యుద్ధంలో అనుమతించగలమా? ఇది డిజిటల్ ప్రపంచం. నేడు అనేక పరికరాలు డిజిటల్, ఏఐ సాంకేతికతతో పనిచేస్తున్నాయి. వివిధ పరికరాలను ఉపయోగించి ఇలాంటి డిజిటల్ దాడులు చేయడం ద్వారా ఎమర్జన్సీ సర్వీసులను స్తంభించేలా చేయడం, పేలుళ్ళకు పాల్పడడం జరిగితే అది తీవ్ర విధ్వంసాన్ని సృష్టిస్తుంది. ఇవి అనైతిక చర్యలు. ఇలాంటి చర్యలను యుద్ధంలోనైనా సరే అనుమతించలేము.

ఈ పేజర్లపై తైవాన్ కంపెనీ తయారీ చిహ్నం ఉంది. ఇస్రాయీల్‌కు వంతపాడుతున్న దేశాల్లో తైవాన్ ఒకటి. అయితే ఈ పేజర్లను తాము తయారు చేయలేదని హంగరిలోని ఒక కంపెనీకి లైసన్సు ఉందని ఆ కంపెనీ తయారు చేసిందని తైవాన్ కంపెనీ అంటుంది. ఏది ఏమైనా ఈ రెండు కంపెనీలు ఒక ఉగ్రవాద చర్యకు సహకరించిన కంపెనీలుగానే పరిగణించవలసి ఉంటుంది. అంతర్జాతీయ దేశాలు, ముఖ్యంగా ఇస్రాయీల్‌కు వంతపాడుతున్న అమెరికా, పాశ్చాత్యదేశాలు ఈ విషయమై చర్యలు తీసుకుంటాయా?

సైబర్ యుద్ధాలు ఎలాంటి విధ్వంసాన్ని సృష్టిస్తాయో ఇది ఒక ఉదాహరణ. యుద్ధాలు యుద్ధరంగం నుంచి సగటుప్రజల ఇంటిలోకి ప్రవేశించే వాతావరణం ఇది. ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధం జరుగుతోంది. పలస్తీనా, ఇస్రాయీల్ మధ్య యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధాల్లో అనేక దేశాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రమేయం కలిగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి డిజిటల్ దాడులను అంతర్జాతీయ సమాజం చూసి మౌనం వహించడం సముచితం కాదు.

# మైనారిటీ రిపోర్ట్

**ముస్లిములు** నిందితులుగా ఉంటే కోర్టుల్లో బెయిల్ దొరకడం చాలా కష్టం. ఈ మాటలు చెప్పింది ఎవరో కాదు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ్ సింగ్. పౌరహక్కుల పరిరక్షణ సంఘం (Association for protection of civil rights (APCR) ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనల సందర్భంగా అనేకమంది అరెస్టయ్యారు. ఈ అరెస్టులు జరిగి నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఈ సందర్భంగా ఏపిసిఆర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దిగ్విజయ్ సింగ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన అరెస్టులపై తీవ్ర విమర్శలు సంధించారు.

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బలు తగిలాయి. ఎన్నికల ప్రచారంలో ముస్లిములపై విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు, మంగళసూత్రం, గొడ్డుమాంసం, మఛిలీ వంటి ప్రయత్నాలు ఎన్ని జరిగినా బీజేపీకి అనుకున్న ఫలితాలు లభించలేదు. బీజేపీ బలహీనపడింది కాని ముస్లిములపై విద్వేష ప్రసంగాల ఉధృతి, దాడుల పరంపర తగ్గడం లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు, ప్రసంగాలు, చర్యల వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ వాతావరణం సంఘ విద్రోహశక్తులకు తామేం చేసినా చెల్లుతుందన్న ధైర్యాన్నిస్తోంది.

ఉదాహరణకు డెబ్బయి సంవత్సరాల ముస్లిం వృద్ధుడిపై రైల్లో జరిగిన దాడి అలాంటిదే. ఆయన తీసుకెళుతున్న ఆహారం గొడ్డుమాంసం అని ఆరోపించి అత్యంత పైశాచికంగా ఆయనపై దాడి చేయడమే కాదు, క్రూరమైన, పైశాచికమైన ఆనందం ఆ యువకుల ముఖాల్లో కనిపించింది.

## ఇటీవల ఒడిశాలో జరిగిందేమిటి?

దేశంలో గొడ్డుమాంసంపై నిషేధం ఉందా? బరంపురంలో ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న ఒక సాంకేతిక కళాశాలలో ఏడుగురు విద్యార్థులను కాలేజీ నుంచి బహిష్కరించారన్న వార్త వచ్చింది. వారు తమ హాస్టల్ గదిలో గొడ్డుమాంసం వండుకుని తిన్నారని విశ్వహిందూపరిషద్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు హంగామా చేశారు. అంతే వారిని కాలేజీ బహిష్కరించింది.

దేశంలో గొడ్డుమాంసంపై నిషేధం ఉందా? గో మాంసంపై నిషేధం ఉంది. కాని గొడ్డు మాంసం నిషేధమా? ప్రపంచంలో గొడ్డుమాంసం ఎగుమతి చేస్తున్న ప్రముఖ దేశాల్లో భారతదేశం ఉన్నప్పుడు గొడ్డుమాంసం గురించి ఈ హంగామాలు ఏం చెబుతున్నాయి? గొడ్డుమాంసం పేరు చెప్పి ఎంత మందిపై దాడులు చేశారు? ఆ సంఘటనలు వార్తలను ఇక్కడ ప్రస్తావిస్తే ఒక పుస్తకమే అవుతుంది. అనేక మూకహత్యలు, మూకదాడుల సంఘటనలున్నాయి. ఇటీవల ఒక కారులో ఆవును తరలిస్తున్నారన్న అనుమానంతో ఈ గూండాలు కాల్చి చంపింది ఒక

హిందూ కుర్రాడిని. ముస్లిం అనుకుని పొరబడి కాల్చి చంపామని వివరణలు ఈ గూండాలు చెప్పడం, అదే వివరణను మన మీడియా ప్రముఖంగా ప్రచారంలో పెట్టడం చూస్తుంటే దేశంలో ఎలాంటి పరిస్థితి ఉందో అర్థమవుతుంది.

ఒకవైపు గొడ్డుమాంసం పేరు చెప్పి ఈ శక్తులు ముస్లిములపై దాడులు చేస్తున్నారు. కాని మరోవైపు ఓట్ల కోసం చేస్తున్న రాజకీయాలు వేరుగా కనిపిస్తున్నాయి. కేంద్రంలో మంత్రి హోదాలో 2015లో బీజేపీ నాయకుడు కిరణ్ రిజిజు స్వయంగా తాను గొడ్డు మాంసం తింటానని, తినకుండా తనను ఎవరూ ఆపలేరని అన్నాడు. గొడ్డుమాంసం తినేవారు పాకిస్తాన్ వెళ్ళాలని ఒకవైపు బీజేపీ నేతలు చెబుతారు. మరోవైపు బీజేపీ నేతలే గొడ్డుమాంసం గురించి మరో మాట చెబుతారు.

ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే చట్టం అనే పెద్ద పెద్ద నినాదాలు మనం వింటూనే ఉంటాం. మేఘాలయ మన దేశంలోని రాష్ట్రమే. ఆవును జాతీయమాతగా ప్రకటించాలంటూ శంకరాచార్య అవిముక్తేశ్వరానంద్ ఒక యాత్ర తలపెట్టారు. కాని మేఘాలయ విద్యామంత్రి రక్కం ఏ. సంగ్మా దీనిపై అభ్యంతరాలు చెప్పారు. ఆయన పార్టీ నేషనల్ పీపుల్స్ పార్టీ బీజేపీకి మిత్రపక్షం. దేశంలో ఎక్కడైనా ఈ ర్యాలీ తీసుకోండి కాని మేఘాలయకి రావద్దని ఖరాఖండిగా చెప్పేశారు. ప్రజలు ఏం తినాలో ఏం తినకూడదో శాసించే హక్కు ఎవరికీ లేదన్నారు. గొడ్డుమాంసం తినకుండా తనను ఎవరూ ఆపలేరని కూడా చెప్పారు. ఈ వార్త హిందూ పత్రికలో కూడా వచ్చింది. బీజేపీ గొడ్డుమాంసం పేరుతో రాజకీయాలు చేస్తుంది కాని, ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం మాట మార్చేస్తుంది. నాగాలాండ్, మేఘాలయ, మిజోరం రాష్ట్రాల్లో నిషేధాజ్ఞలు ఉండవని 2017లో బీజేపీ నేతలు చెప్పిన మాటలు వార్తల్లో వచ్చాయి. నాగాలాండ్ బీజేపీ చీఫ్‌గా అప్పట్లో పనిచేసిన విసాసోలి లోంగూ మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉత్తరప్రదేశ్ మాదిరి గోవధ నిషేధాలు నాగాలాండ్‌లో అమలు చేయబోమని అన్నారు. ఒకే దేశం, ఒకే చట్టం గురించి మాట్లాడే పార్టీ మాటలివి. ఇవన్నీ వార్తల్లో వచ్చాయి. ఇవి అందరూ చదివిన విషయాలే. అయినా గొడ్డు మాంసం సాకుతో మూక దాడులు, మూకహత్యలు జరుగుతున్నాయి. గత మాసంలో హర్యానాలో జరిగిన సంఘటన అలాంటిదే. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన వలసకూలీ గొడ్డు మాంసం తిన్నాడన్న అనుమానంతో కొట్టి చంపేశారు. ఇలాంటి సంఘటనలెన్నో. స్కూలుకు వస్తున్నప్పుడు టిఫిన్ బాక్సులో నాన్ వెజ్ తీసుకొచ్చిన చిన్నపిల్లాడిని ఉగ్రవాదిగా పేర్కొన్న ప్రిన్సిపల్, పనిష్మెంట్ ఇచ్చి పిల్లాడిని స్కూలు నుంచి పంపేసే ప్రయత్నాలు. ఇవన్నీ ఏం చెబుతున్నాయి? స్కూలులో నాన్‌వెజ్ తీసుకెళ్ళడంపై నిషేధం ఉందా? స్కూలు నియమాలున్నాయా?

బీజేపీ ముఖ్యమంత్రులున్న రాష్ట్రాల నుంచి వస్తున్న వార్తలు అందరికీ తెలిసినవే. బుల్డోజర్ జస్టిస్ అంటూ వేస్తున్న వీరంగాలు కూడా చూస్తున్నాం. మధ్యప్రదేశ్‌లో గొడ్డుమాంసం ఇంట్లో ఉందన్న ఆరోపణతో 11 మంది ముస్లిముల ఇళ్ళను పోలీసులు బుల్డోజర్లతో కూల్చేశారు. ముస్లిములనే కాదు దళితులపై కూడా ఈ దౌర్జన్యాలు జరుగుతున్నాయి. ఇటీవల మధ్యప్రదేశ్‌లోనే పోలీసు స్టేషనులో దళిత కుటుంబానికి చెందిన తల్లీకొడుకులపై పోలీసుల దౌర్జన్యం గురించిన వార్త వచ్చింది.

అస్సాంలో బీజేపీ ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ముస్లిములపై వరద జిహాద్, ఎరువుల జిహాద్ ఇలా నానా రకాల జిహాదుల పేరుతో చేస్తున్న విద్వేష ప్రచారం అందరికీ తెలిసిందే. మేఘాలయలో ఉన్న ముస్లిం ప్రయివేట్ యూనివర్శిటీ USTM నుంచి ఉత్తీర్ణులైన వారికి అస్సాంలో ఉద్యోగార్హత ఉండదన్నాడు. మరో బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నూర్ లో ఒక ఇంట్లో గొడ్డుమాంసం ఉందన్న ఆరోపణతో దాడి చేసి నానా యాగి చేశారు. ఈ దాడిలో 55 సంవత్సరాల మహిళ మరణించింది. ఆ ఇంట్లో పోలీసులకు ఏమీ దొరకలేదని వార్త. అక్కడి 6 గురు ముస్లిం రాజకీయ నాయకులపై 175 కేసులు పెట్టారు. ఇందులో కొందరు జైల్లో ఉన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ తనపై కేసులను రద్దు చేయించుకున్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో మస్జిదులపై గలాభా సృష్టిస్తున్నారు. మహారాష్ట్రలో మస్జిదుల్లో దూరి చావబాదుతామని బెదిరింపులు జారీ చేస్తున్నారు. బీజేపీ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయంగా బలహీనపడింది కానీ, మతతత్వ రాజకీయాల ఉధృతి మరింత పెరిగింది.

రాజకీయంగా బలహీనపడడం వల్ల కొన్ని విధానపరమైన నిర్ణయాల్లో వెనక్కి తగ్గవలసి వచ్చింది. మిత్రపక్షాల ఒత్తిళ్ళవల్ల వెనక్కి తగ్గక తప్పలేదు. కాని మతతత్వ రాజకీయాలే తమకు మరోసారి భారీ విజయాలు సాధించిపెడతాయన్న ధోరణిలోనే బీజేపీ నేతలున్నారు. మోడీ రెండు సార్లు ప్రధానిగా సాధించిందేమిటి? అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ వంద రోజుల పరిపాలనలోను చెప్పుకోడానికి ఏమీ లేదు. ఇక మిగిలింది మతతత్వ రాజకీయాలే. అందువల్లనే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు బాహాటంగా విద్వేష రాజకీయాలు నడుపుతున్నారు. కాని ఈ రాజకీయాలను ప్రజలు ఏవగించుకుంటున్నారన్నది ఈ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చెబుతూనే ఉన్నాయి. ఇలాంటి మతతత్వ, విద్వేష రాజకీయాలు ఎలాంటి వాతావరణాన్ని సృష్టిస్తాయో ముస్లిముగా పొరబడి చంపేశామని నిందితులు చెప్పిన మాటల్లో స్పష్టంగా అర్థమవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చడానికి పూనుకోవలసింది ప్రజలే. ✤

**రిపోర్టు**



# ప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధనల వెలుగులో 'పరమత సహనం' పై ప్రత్యేక కార్యక్రమం

**కడప పట్టణంలో** స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో జమాఅతె ఇస్లామీ హింద్ కడప శాఖ ఆధ్వ ర్యంలో ముహమ్మద్ ప్రవక్త(సఅసం) జన్మదినోత్సవం సందర్భంగా "ప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధనల వెలుగులో పరమత సహనం" అనే అంశంపై ఒక ప్రత్యేక కార్య క్రమాన్ని నిర్వహిం చారు. జమాఅతె ఇస్లామీహింద్ కేంద్ర ప్రతినిధి మండలి సభ్యులు మౌలానా ఇందాదుల్లా హుసేని నిజామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస్‌రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు డాక్టర్ అవ్వారు అర్జున్ కుమార్, ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు హాజ రయ్యారు. ప్రధాన వక్తగా ప్రముఖ సైకాలజిస్ట్, జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర సలహామండలి సభ్యులు సాదిక్ అహ్మద్ పాల్గొని ప్రసంగించారు.

స్థానిక అధ్యక్షులు ఖాదర్ వలీ మాట్లాడుతూ, ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించిన పవిత్ర మాసం సందర్భంగా ఆయన మానవ జీవితానికి సంబంధించిన వివిధ కోణాలపై ఆయన బోధనలను ప్రజలందరికీ తెలియజేయాలనే ఉద్దేశ్యంతో వివిధ కార్య క్రమాలను చేపడుతున్నామన్నారు.

సాదిక్ అహ్మద్ మాట్లాడుతూ, భారతదేశం వివిధ జాతులు, మతాల సంగమమని, భిన్నత్వంలో ఏకత్వమే మన దేశానికి ప్రతీక అని తెలిపారు. ఇక్కడి వైవిధ్యం ఎలా ఉందంటే ప్రతి 15 నుంచి 20 కి.మీలకు భాష మారుతుందని, భాషలోని యాస కూడా మారుతుందన్నారు. ఇంతటి వైవిద్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని వక్కాణించారు. మన దేశంలో శాంతి, మత సామరస్యంతో జీవించాలంటే ప్రవక్త ముహమ్మద్(స) బోధించిన పరమత సహనాన్ని మనమందరం పెంపొందించుకో వాలన్నారు. సోదర భావం, సమానత్వం, మానవ సేవ, సహిష్ణుత, దయ, కరుణ, పరమత సహనం ప్రవక్త ముహమ్మద్(స) బోధనల సారాంశమని తెలిపారు.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, వివిధ వర్గాల మధ్య సోదర భావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవడం తనకు ఆనందాన్ని చేకూర్చిందన్నారు. మనిషి ముఖ్యంగా మూడు విషయాలలో వెంపర్లాడుతుంటాడని, అవి ఒకటి ఆశ, రెండవది అత్యాశ, మూడవది దురాశ అని అన్నారు. వాటి మీద మనిషి అదుపు సాధిస్తే తన జీవితంలో విజయాన్ని సాధించగలడని తెలిపారు. తన మతాన్ని మత ఆచారాలను పాటిస్తూనే ఇతరుల మతాలను గౌరవిస్తూ పోతే ఇక శాంతిని సాధించడం చాలా సులభం అని అన్నారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA) కడప జిల్లా అధ్యక్షులు డాక్టర్ అవ్వారు అర్జున్‌కుమార్ మాట్లాడుతూ, మనిషి H2O పార్ములాతో ముందుకు వెళితే ఎటువంటి ఒత్తిడికి లోను కావాల్సిన అవసరం లేదన్నారు. H2O అంటే H- హ్యాపినెస్, H- హెల్త్, O-ఆప్టిమిజమ్ అని తనదైన శైలిలో తెలిపారు. APNGGO's జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ, ఇటువంటి మంచి కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు జమాఅతె ఇస్లామీ హింద్ కడప శాఖకు ధన్యవాదాలు తెలియ జేస్తున్నానన్నారు.

చివరగా జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర ప్రతినిధి మండలి సభ్యులు మౌలానా ఇందాదుల్లా హుసేని నిజామి గారు తన అధ్యక్ష ప్రసంగంలో జమాఅత్ దేశంలోని ప్రజల మధ్య శాంతిని, సోదరభావాన్ని, సామరస్యాన్ని పెంపొందించడానికి గత 70 ఏళ్లుగా పని చేస్తుందన్నారు. ముహమ్మద్ ప్రవక్త (సఅసం) బోధ నలు సర్వ మానవాళికి మార్గదర్శకం అనీ, మొత్తం చరిత్రలోనే అత్యంత ప్రభావవంతులైన వ్యక్తుల జాబితాను ప్రముఖ రచయిత మైకేల్ హార్ట్ తన పరిశోధనాత్మక పుస్తకంలో పొందుపరచి నప్పుడు ముహమ్మద్ ప్రవక్త(సఅసం) వ్యక్తిత్వానికి మొదటి స్థానాన్ని కేటాయించారన్నారు. చరిత్రలో ఒక కొత్త అధ్యాయం సృష్టించిన గొప్ప వ్యక్తి బోధనలను తెలుసుకోవడం తద్వారా సమాజ సంస్కరణకు పూనుకోవడం అత్యంతావశ్యకం అని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ సోద రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ✤

అధ్యాయం -17

47

# 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎమ్. మలిక్

### అబూ బక్ర్ కాలం - మహనీయ అలీ(ర)

మహనీయ ఫాతిమా(ర) పరమపదించిన తరువాత మహనీయ అలీ(ర) ఖలీఫాని కలసుకున్నప్పుడు మహనీయ అబూ బక్ర్(ర) ఇలా నుడివారు, "ఎవని గుప్పెట్లో నా ప్రాణం ఉందో ఆయన సాక్షిగా చెబుతున్నాను, మేలు చేసే వ్యవహారంలో నాకు నా బంధుగణం కన్నా ప్రవక్తశ్రీ(స) బంధువులు ప్రియమయిన వారు. మీకూ నాకూ మధ్య ఏర్పడిన వారసత్వ భేదాభిప్రాయంలో నేను మంచిని ఆశ్రయించడానికే ప్రాధాన్యత నిచ్చాను. ప్రవక్తశ్రీ(స) చేస్తూ ఉండగా నేను మానివేసిన పని అంటూ ఏదీ లేదు."

ఆ మాటలకు మహనీయ అలీ (ర), "మాకు మీ మహత్తు బాగా తెలుసు. దైవం మీకు ప్రసాదించిన దాన్నీ మేము ఎరిగిన వారమే. దైవం మీకు ఏ శుభం అనుగ్రహించాడో దాని పట్ల ఈర్ష్య కలిగి లేము, దైవప్రవక్తతో మా బంధుత్వం కారణంగా ఖిలాఫత్‌లో మా వాటా కూడా ఉంటుందని మాత్రమే భావించాము, అంతే" అని మారు పలికారు.

### మహనీయ అలీ(ర) మాట విన్న ఖలీఫా

మహనీయ అబూ బక్ర్(ర) ఖిలాఫత్ ప్రారంభ కాలంలో ధర్మభ్రష్టులు, జకాత్ ఇవ్వ నిరాకరించినవారు, తిరుగుబాటు దారులు దేశంలో అనేక చోట్ల విజృంభించారు. అప్పుడు ఖలీఫా స్వయంగా తిరుగుబాటు దారుల అణచివేతకు వెళ్ళడానికి బయలుదేరారు. ఆ సందర్భంలో మహనీయ అలీ(ర) ఆయన ఎక్కిన గుర్రం ముక్కుతాడు పట్టుకుని ఇలా అన్నారు,

"నేను ప్రవక్తశ్రీ ఉహుద్ నాడు పలికిన మాట మీకు చెబుతున్నాను. మీ కరవాలం ఒరలో పెట్టండి, మమ్మల్ని బాధకు గురి చేయకండి, మదీనాకు మరలండి. మీకు ఏదయినా జరిగితే ఇస్లామ్ వ్యవస్థ మొత్తం ఛిన్నాభిన్నం అయిపోతుంది."

ఖలీఫా అబూ బక్ర్(ర) ఆ మాటలు విని మరలి వచ్చేశారు.

### అలీ(ర) నిర్వహించిన బాధ్యతలు

మహనీయ అలీ(ర), మహనీయ అబూ బక్ర్ ఖిలాఫత్‌లో సలహా మండలి సభ్యులు గాను, షరీఅత్ ఆదేశాలు (ఫత్వాలు) జారీ చేసే కమిటీ ప్రముఖ సభ్యులుగాను అలరారే వారు. ఆయన ధర్మం, షరీఅత్ విషయంలోనూ

ప్రజల వ్యక్తిగత, సామూహిక సమస్యల్లోనూ రాజకీయ పరిపాలనా రంగంలోనూ అనన్యమయిన సేవలు అందించారు. వాటి వల్ల జనం ఆయన వద్ద ఆయన స్వయంగా సంకలనం చేసిన పుస్తకమో లేదా దైవ సందేశహరుల ద్వారా లభించిన గ్రంథమో ఉందని భావించేవారు. తద్వారానే ఆయన పరిష్కారాలు అందజేస్తున్నారని అనుకునేవారు కూడా.

మహనీయ అబూ బక్ర్(ర) కాలంలోనే మహనీయ అబూ హుజైఫా మహనీయ అలీనే అడిగారు, "మీ వద్ద ఏదయినా గ్రంథం ఉందా? అని. ఆయన దానికి సమాధానంగా ఇలా అన్నారు, "నా వద్ద ఉన్నది కేవలం దివ్య ఖుర్ఆన్, బుద్ధి వివేకాలు మాత్రమే".

## మహనీయ ఉమర్ ఫారూక్(ర) కాలంలో

అందరితోపాటు మహనీయ అలీ (ర) కూడా మహనీయ ఉమర్(ర) సమక్షంలో బయ్త్ చేశారు. ఈయనతో కూడా అలీ స్వచ్ఛమయిన సత్సంబంధాలు కలిగి ఉండేవారు. ఒక సందర్భంలో ఉమర్(ర), మహనీయ అలీని గురించి, "న్యాయ నిర్ణయంలోనూ షరీఅత్ అన్వయంలోనూ అలీకు ప్రాధాన్యం ఉంది" అన్నారు. మహనీయ అలీకి ఉన్న స్థానం వ్యాజ్యాల తీర్పు చెప్పేవారిలో ప్రముఖమయింది. దివంగతులయ్యే ముందు మహనీయ ఉమర్ ఏర్పరచిన కమిటీలో, సముదాయంలోని అత్యుత్తమమయిన, ఎన్నికయిన వారినే నామకరణం చేశారు, వారిలో మహనీయ అలీ కూడా ఉన్నారు. వారిని గురించి ప్రవక్తశ్రీ(స), ఆయన స్వర్గార్హులని పలికినట్లు కూడా ఆయన సాక్ష్యమిచ్చారు!

## ఖలీఫా స్థానంలో

ఓ మహమ్మారి సృష్టించిన విపత్తులో ప్రజల్ని ఆదుకునేందుకు మహనీయ ఉమర్(ర) సిరియా వెళ్ళినప్పుడు తన స్థానంలో ప్రత్యామ్నాయంగా అలీ(ర)ని నియమించారు. అలాగే ఈరాన్ పాలకుడు ఇస్లామ్‌కు వ్యతిరేకంగా సైన్యాన్ని సమీకరించినప్పుడు కూడా తాను సైన్యానికి నాయకత్వం వహించాలని అనుకున్నారు. కాని సలహామండలి దాన్ని వ్యతిరేకించింది. అప్పుడు కూడా మహనీయ అలీని సేనానిగా నియమించదలిచారు. కాని దాన్ని మహనీయ అలీ(ర) తిరస్కరించారు.

## మహనీయ ఉమర్(ర) కాలంలో

మహనీయ ఉమర్ (ర) ఖిలాఫత్ కాలంలో మహనీయ అలీ(ర) సలహామండలి సభ్యులు మాత్రమే కాక ఖలీఫాకు ప్రధాన సలహాదారునిగా కూడా వ్యవహరించారు. ఖలీఫా ఉమర్(ర), అలీ విజ్ఞత, ధర్మజ్ఞాన విషయంలో ఆయన దృష్టి, ఆయన మహత్తు అన్నీ బాగా ఎరిగినవారు కావడంతో ఆయనంటే ఎంతో గౌరవంగా మెలిగేవారు."మనలో ఉత్తమ నిర్ణయం చేసేవారు అలీ" అనేవారు.

మహనీయ ఉమర్(ర) వద్దకు ఓ స్త్రీని తీసుకువచ్చారు జనం. ఆమె వ్యభిచరించిందని ఆరోపణ. దాన్ని పురస్కరించుకుని ఆమెకు తగిన శిక్ష విధించారు ఖలీఫా. ఆమెను శిక్షించడానికి తీసుకు వెడుతూ ఉండగా మహనీయ అలీ కలిశారు. ఆమెను చూసి, ఆయన ఏమిటీ వ్యవహారం అని అడిగారు. ఈమె వ్యభిచరించిందని ఆమెను శిక్షించడానికి తీసుకు వెడుతున్నామని చెప్పారు. ఆయన వారిని ఆపి తిరిగి వాపసు తీసుకు వెళ్ళవలసిందని పురమాయించారు అలీ. వారు ఆమెను మహనీయ ఉమర్(ర) వద్దకు తీసుకువెళ్ళారు.

మహనీయ ఉమర్(ర) మహనీయ అలీ(ర)ని పిలువనంపారు. ఆయన వచ్చి మీరు ప్రవక్తశ్రీ(స) నుడివిన ఈ మాట విన లేదా? అని ప్రశ్నించారు. ఇంకా ఇలా అన్నారు, "ముగ్గురు వ్యక్తులు మరణ శిక్షార్హులు కారు. ఒకరు, నిద్రపోతున్న వ్యక్తి మేల్కొనే వరకు, మరొకరు, యుక్తవయసుకు చేరని వారు, యుక్త వయసుకు చేరే వరకు, మూడవ అతను మతి చలించిన వ్యక్తి, తిరిగి అతనికి బుద్ధీ వివేకాలు కుదిరే వరకు."

దానికి మహనీయ ఉమర్(ర), "అవును నేను ఈ హదీసు విన్నాను" అన్నారు. అప్పుడు అలీ అన్నారు, "ఈమె ఫలానా తెగకు చెందిన మహిళ, ఈమె మతి స్థిమితం కోల్పోయిన స్త్రీ, ఆ వ్యక్తి ఈమె తో వ్యభిచరించినప్పుడు ఈమె మతి స్థిమితం లేకపోవడంతో జరిగేది ఏమిటో స్పృహ కలిగి ఉండదు." మహనీయ ఉమర్(ర) అంగీకరించారు. కడకు ఆమెను నిరపరాధిగా వదిలేశారు.

## ఖలీఫా ఖర్చులు

మహనీయ ఉమర్(ర) ఖిలాఫత్ చేపట్టిన తరువాత తాను చేస్తున్న వ్యాపారం పట్ల శ్రద్ధ చూపలేక పోయారు. అందువల్ల ఇల్లు గడవడం కష్టమయింది. కొన్నాళ్ళ తరువాత సలహామండలిని పిలిపించారు. ఈ సమస్య ముందుంచారు. మహనీయ ఉస్మాన్(ర), "మీరు మీ ఖర్చులు, మీ ఇంటి

వారి ఖర్చులు బైతుల్ మాల్ నుంచి తీసుకోవచ్చు.'' మరో సహచరులు కూడా ఇదే సలహా ఇచ్చారు. ఆ పైన మహనీయ అలీ(ర), ''మీరు ఉదయం సాయంత్రం రెండుపూటల భోజనం ఖర్చు తీసుకోగలరు'' అన్నారు. మహనీయ ఉమర్(ర) ఈ సలహానే పాటించారు.

## హిజ్రీ శకం

మహనీయ ఉమర్(ర) పాలనా వ్యవహారాల వ్యవస్థీకరణ కొరకు తమదంటూ ఓ తేదీల నిర్ణయ విధానం అవసరమని భావించారు. సలహామండలిని సమావేశ పరచి ఈ విషయం ప్రస్తావించారు. దానికి సమాధానంగా మహనీయ అలీ(ర), ''ప్రవక్త మహనీయులు హిజ్రత్ చేసి, బహుదైవారాధకుల భూమిని వదలిన నాటి నుంచి'' అని చెప్పారు. ఈ సలహాను వెంటనే ఆమోదించారు మహనీయ ఉమర్(ర). వెంటనే హిజ్రీ శకాన్ని జారీ చేశారు.

## ఖలీఫా స్థానంలో

మహనీయ ఉమర్(ర) తన ఖిలాఫత్ కాలంలో అనేక పర్యాయాలు మహనీయ అలీ(ని) తన స్థానంలో ఖలీఫాగా నియమించారు. కాదిసియ విజయానికి వెళ్ళే ముందు, పాలస్తీనాకు బయలుదేరే ముందు, తాను చివరి సారిగా హిజ్రీ 23వ సంవత్సరం, విశ్వాసుల మాతృమూర్తులతో హజ్జ్ చేయడానికి ముందు, మహనీయ అలీని తన స్థానంలో ఖలీఫాగా నియమించి వెళ్ళారు. ఈ పర్యటనలన్నింటిలో మహనీయ అలీ(ర) సలహాలు ప్రధానంగా ఆగ్రహించారు ఖలీఫా ఉమర్(ర).

ఒక ఉల్లేఖనం ప్రకారం, మహనీయ అలీ(ర) ఖలీఫాగా ఓ దుప్పటి ధరించేవారు. ఎవరో అడిగారు, ''అమీరుల్ మూ'మినీన్! మీరు తరచుగా ఈ దుప్పటే ధరిస్తారు (ఎందుకు)?'' ''అవును, ఇది నా ఆప్త మిత్రుడు ఉమర్ బిన్ ఖత్తాబ్(ర) ధరింపజేసింది. ఆయన దైవం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించారు, దైవం కూడా ఆయన్ని స్వీకరించాడు'' అంటూ మహనీయ అలీ రోదించ సాగారు.

ఒకసారి మహనీయ ఉమర్(ర) మహనీయ అలీకి యాన్‌బూ (సఊది అరేబియా) లో ఓ జాగీరు బహూకరించారు. దానికి తోడు అలీ కూడా కొంత భూమి కొన్నారు. అక్కడ ఓ బావి త్రవ్వించారు. బావి త్రవ్వుతూ ఉండగా నీటి చలమ బయల్పడింది. దానికి ఆయన ఎంతో సంతసించి ఆ భూమి మొత్తాన్ని నిరు పేదలకు, నిరాధార జనుల కొరకు దానం చేసి వేశారు! ఇంకా ఇలా ప్రకటించారు,

''అలీ బిన్ అబీ తాలిబ్ స్వయంగా చేసిన నిర్ణయం, నేను యాన్‌బూ, వాదియె కురా, ఉజైనా, రాఅ ప్రాంతాలను సంతోషంతో దైవ మార్గంలో దానం చేసి వేశాను. నేను కేవలం అల్లాహ్ ప్రసన్నత కోరుకుంటున్నాను. ఈ భూముల్ని దైవమార్గంలో ప్రతి అవసరానికి ఉపయోగించుకోవచ్చు. యుద్ధ పరిస్థితులయినా, ప్రశాంత వాతావరణం అయినా ఏమి సంభవించినా ఏ బంధువుకూ ఇది అమ్మరాదు. మరి ఎవరికీ బహూకరించనూరాదు. నేను బ్రతికి ఉన్నా లేదా మరణించినా దీనికి ఎవరూ వారసులు కారు. నా ఈ ఆచరణకు ఉద్దేశం దైవ ప్రసన్నత, పరలోక సాఫల్యం మాత్రమే, అల్లాహ్ దీన్ని స్వీకరించు గాక! ఆయనే దీని అత్యుత్తమ వారసుడు. ఈ నిర్ణయం నాకూ పరమ ప్రభువు అల్లాహ్‌కు మధ్య జరిగింది.''

## ప్రవక్త మీరాశి సమస్య

మహనీయ ఉమర్ ఫారూక్(ర) ఖిలాఫత్‌లో రెండేళ్ళు కడచిన తరువాత ప్రవక్తశ్రీ మీరాశి ప్రశ్న తిరిగి తలెత్తింది. అప్పుడు మహనీయ ఉమర్(ర) ఇచ్చిన సమాధానం :

''... దైవాదేశంతో మహనీయ అబూ బక్ర్ పరమపదించారు. నేను ఆయన స్థానంలో వచ్చాను. నేను రెండేళ్లుగా ఆ ఆస్తిని కాపాడాను. ప్రవక్త మహనీయులు, అబూ బక్ర్ చేసినదే నేనూ చేశాను. అల్లాహ్‌కు తెలుసు, యదార్థం ఇదే అని. నేను నేర్చుకున్న దాన్నే అమలుపరస్తున్నాను. మీరు ఆ విషయాన్ని ఎత్తినప్పుడు ప్రవక్తశ్రీ(స) నుడివినదే వినిపించాను :

'మా (ప్రవక్తల) మీరాశి, మేము వదలి పెట్టినది ఏమయినా, అది సదకాగా పరిగణించబడుతుంది' అని. అయితే ఆ ఆస్తిని మీకు అప్పగించడమే ఉత్తమమని తలచి నేను మీకు అప్పగిస్తాను, కాని మీరు దైవంతో ప్రమాణం చేయాలి, దాని పట్ల ప్రవక్తశ్రీ(స), మహనీయ అబూ బక్ర్(ర), ఇంకా నేను వ్యవహరించినట్లే వ్యవహరిస్తానని. మీరు సరేనంటే దాన్ని అప్పగిస్తాను''.

అలాగే ఆ ఆస్తిని మాత్రం వారికి అప్పగించి మిగిలిన దాన్ని ఎప్పటి లాగే ప్రభుత్వ అధీనంలోనే ఉండనిచ్చారు ఆయన.

★★★


## ‘చరితార్థులు’-2



# సయ్యద్ పీర్ సిబ్గతుల్లాహ్ షాహ్ రషాది

## (1910-1943)

58




**మేము కడు స్వతంత్రులం ...** మేము ఎవ్వరికి బానిసలం ఏ మాత్రం కామంటే కాము అంటూ, ఆంగ్లేయ ప్రభువుల పెత్తనాన్ని ధిక్కరిస్తూ, ఆంగ్లేయాధికారుల దాష్టికానికి వ్యతిరేకంగా పోరుబాటన సాగి కడకు తన ప్రాణాలను కూడా అర్పించిన సయ్యద్ పీర్ సిబ్గతుల్లాహ్ షాహ్ రషాది 1910 ప్రస్తుత పాకిస్తాన్‌లోని సింధ్ ప్రాంతాన జన్మించారు. గురు–శిష్య (పీర్–మురీద్) పరంపరకు చెందిన పీర్ సిబ్గతుల్లా పూర్వీకులు సిగ్బతుల్లా షాహ్ బాద్షా (1779-1831) ‘హుర్ సోదరత్వం’ పేరుతో పోరాటయోధుల దళాలను ఏర్పరచి స్వేచ్ఛా–స్వాతంత్ర్యాల కోసం పోరాటాన్ని ఆరంభించారు. ఆ పోరాట యోధుల వారసునిగా సయ్యద్ పీర్ సిబ్గతుల్లా కూడా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరుబాట పట్టారు. స్వేచ్ఛ కోసం పోరాడుతున్న హుర్ సామాజిక సమూహం పట్ల ఆంగ్లేయ ప్రభుత్వం, ఆంగ్ల సైనికులు, పోలీసులు అత్యంత పాశవికంగా వ్యవహరించడంతో ఆగ్రహించిన పీర్ సిబ్గతుల్లా ప్రత్యేక సాయుధ దళాలను ఏర్పాటు చేసి ‘స్వేచ్ఛ లేదా మరణం’ మాత్రమే అంతిమ లక్ష్యాలుగా నిర్దేశించుకుని సాయుధ పోరాటానికి సిద్దపడ్డారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఇతరత్రా సమూహాలు కూడా ఆయుధాలను గురిపెట్టాలని ఆయన ప్రబోధించారు. ఆయన చర్యలతో ఆగ్రహించిన ఆంగ్ల ప్రభుత్వం హుర్ పోరాటాన్ని అణిచివేయడానికి సైనిక చట్టాలను ప్రవేశపెట్టారు. ప్రత్యేకంగా ‘హుర్ చట్టం’ కూడా తెచ్చి ఆయన మీద పలు నేరాలను మోపి, న్యాయస్థానాలకు రప్పించి ఆయనను నియంత్రించడానికి విఫల ప్రయత్నం చేసింది. నిర్బంధాలు, శిక్షలు సయ్యద్ పీర్ సిబ్గతుల్లాహ్ షాహ్ రషాదిను ఏ మాత్రం నిలువరించలేకపోయాయి. 1942 మే 13న లాహోర్ మెయిల్‌ను హుర్ దళాలు పట్టాలు తప్పించాయి. ప్రతిచర్యగా ఆంగ్ల పాలకులు పీర్ సిగ్బ తుల్లా కేంద్ర కార్యస్థానం, ఆయన నివాసం, హుర్ దళాల ప్రత్యేక శిక్షణా కేంద్రాల మీద ఎడతెగని దాడులు సాగించారు. 1942 మే 26న సయ్యద్ పీర్ సిబ్గతుల్లాహ్ షాహ్ రషాది బంగ్లాను కూడా బాంబులతో విధ్వంసం గావించి, అక్టోబర్ 24 ఆయనను అరెస్టు చేసి భారత దేశంలోని సియోనికి తరలించారు. ఆ చర్యతో కోపోద్రిక్తులైన హుర్ దళాలు దాడులను మరింత ఉధృతం చేశాయి. ‘స్వేచ్ఛ లేదా మరణం’ అంటూ పోరుబాటన పరుగులెత్తుతున్న హుర్ దళాలను పీర్ సిబ్గతుల్లా మరణం ఒక్కటే నిలువరించగలదన్న నిర్ణయానికి వచ్చిన ఆంగ్ల ప్రభుత్వం 1943 జనవరిలో సియోని నుండి సయ్యద్ పీర్ సిబ్గతుల్లాహ్ షాహ్ రషాదిని సింధ్‌కు రప్పించి హైదరాబాద్ (సింధ్) కేంద్రకారాగారంలో పటిష్టమైన బందోబస్తు మధ్యన ఉంచి, విచారణ తంతు జరిపి చివరకు ఉరి శిక్ష ప్రకటించింది. ఆ ఉరి శిక్షను 1943 మార్చి 20న అమలు పర్చగా హుర్ జనులతోపాటుగా సర్వజనుల స్వేచ్ఛా–స్వాతంత్ర్యాల కోసం పోరాడిన సయ్యద్ పీర్ సిబ్గతుల్లాహ్ షాహ్ రషాది 34 సంవత్సరాల వయస్సులో అమరులయ్యారు. ✤



**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త**

**సయ్యిద్ నశీర్ అహమ్మద్**

**రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**



# ‘విశ్వాసం’ కోరే లక్షణాలు

- అల్లామా సయ్యిద్ సులైమాన్ నద్వి (రహ్మ)

మన మనసులో ఉన్న ‘విశ్వాసం’ మన ఇంటి లోని దీపం వంటిది. మరి ఆ దీపం విరజిమ్మే వెలుగును బట్టే దాని నాణ్యత ఎటువంటిదో తెలుస్తుంది కదా! ఈ నేపథ్యంలో మహాప్రవక్త (స) వారు ఇలా ప్రబోధించారు :

1. ఈమాన్ (విశ్వాసం) శాఖలు డెబ్బయికి మించి ఉన్నాయి. వాటిలో వ్రీడ (బిడియం) ఒకటి.

2. ఈమాన్ శాఖలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ‘దేవుని ఏకత్వం’ (తౌహీద్) గురించి చేసే ప్రకటన అన్నిటికీ మించినది. కాగా; దారిలో పడివున్న ఏదైనా బాధాకర మైన వస్తువును మీరు తొలగిస్తే అది ఈమాన్ యొక్క అన్నిటికన్నా తక్కువ స్థాయి సదాచరణ అనిపించు కుంటుంది.

3. ఎవరిలోనయితే మూడు విషయాలున్నాయో అతడు విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించాడు. మొదటిది : అతనికి దేవుడు మరియు దైవప్రవక్త అందరికన్నా ప్రియతములై ఉండాలి. రెండవది : అతడు కేవలం దేవుని మెప్పుకై ఇతరులను ప్రేమించేవాడై ఉండాలి. మూడవది: విశ్వసించిన మీదట తిరిగి తిరస్కార వైఖరికి ఒడిగట్టడం పట్ల అతనికి కలిగే బాధ అగ్నికి ఆహుతి అవటం వల్ల కలిగే బాధలాంటిదై ఉండాలి.

4. ఎవరిలోనయితే మూడు విషయాలున్నాయో అతడు విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించాడు -

(అ) సత్యం ముందు వాదులాటకు దిగకుండా జాగ్రత్త పడటం.
(ఆ) కష్టాలు వచ్చిపడినా అబద్ధం చెప్పకుండా ఉండటం.
(ఇ) (దైవికంగా) ఎదురైనదేదీ తొలగిపోదని దృఢంగా నమ్మటం.

5. మూడు అంశాలు ఈమాన్‌లో అంతర్భాగాలు :

**ఒకటి:** లేమిలో సయితం దైవమార్గంలో ఖర్చు పెట్టడం.

**రెండు:** లోకంలో శాంతినీ, సౌమనస్యాన్నీ వ్యాపింప జేయడం.

**మూడు:** వ్యవహారం తన వరకు వచ్చినప్పుడు సయితం న్యాయ సమ్మతంగా మసలడం.

6. మీలో ఎవరయినాసరే, తన స్వయం కొరకు ఇష్టపడేదే

తోటి సోదరుని కొరకు కూడా ఇష్టపడనంత వరకూ సంపూర్ణ విశ్వాసి కాలేడు.

7. ఎవరి నోటి ద్వారా, చేయి ద్వారా సాటి ముస్లిం సురక్షితంగా ఉండగలడో అతడే (సిసలయిన) ముస్లిం. మరే వ్యక్తి ప్రవర్తన అయితే జనులు తనను అమితంగా నమ్మి ఆఖరికి తమ ధన ప్రాణాలను సయితం తన చెప్పుచేతుల్లో అప్పగించడానికి సంసిద్ధమయ్యే స్థితికి చేరుస్తుందో అతడే (సిసలయిన) విశ్వాసి.

8. ఒక వ్యక్తి వచ్చి, 'ఓ దైవ ప్రవక్తా (స)! ఏ ఇస్లాం అన్నిటి కన్నా శ్రేష్ఠమైనది?' అని ప్రశ్నించగా, "(ఆకలిగొన్న వారికి) అన్నం పెట్టడం, తెలిసినవారికీ, తెలియని వారికీ - ప్రతి ఒక్కరికీ - శాంతి నొసగాలని ప్రార్థన చేయటం (సలాం చేయటం).

9. ఒక వ్యక్తి వచ్చి, "ఓ దైవప్రవక్తా! ఇస్లాం అంటే అసలేమిటి?" అని ప్రశ్నిస్తాడు. "మంచి మాట పలకటం. (ఆకలిగొన్న వారికి) అన్నం పెట్టడం" అని ఆయన (స) జవాబిచ్చారు. "మరి ఈమాన్ అంటే ఏమిటీ?" అని అడగ్గా, "సంయమనం పాటించడం, నైతిక శౌర్యాన్ని చూపడం (ప్రశాంతంగా వినటం)" అని మహనీయ ముహమ్మద్ (స) చెప్పారు.

10. మోమిన్ (విశ్వాసి) అయినవాడు ఎవరినీ ఎగతాళి చేయడంగానీ, ధూత్కరించడం గానీ, దూషించడం గానీ, చెడు అనడం గానీ చేయడు.

11. ప్రతి ముస్లిం సాటి ముస్లింకు సోదరుడవుతాడు. కనుక అతనికి అన్యాయం చేయడం గానీ, అతన్ని తిట్టడం గానీ చేయకూడదు. ఎవరైతే తన సోదరుని సహాయమై నిమగ్నుడవుతాడో అతని సహాయంలో దేవుడు నిమగ్నుడవుతాడు. మరెవరయితే తోటి ముస్లింకు ఎదురైన ఆపదను తొలగిస్తాడో అతనిపై వచ్చి పడిన ఆపదను దేవుడు తొలగిస్తాడు.

12. 'ప్రజల చేత నిజాయితీపరునిగా భావించబడిన వాడే **మోమిన్.** తన నోటి ద్వారా, చేతి ద్వారా జనులకు రక్షణ నివ్వగలిగిన వాడే **ముస్లిం.** చెడును విడిచిపెట్టిన వాడే సిసలయిన **ముహాజిర్.** ఎవరి అధీనంలో నా ప్రాణం ఉందో ఆయన సాక్షిగా చెబుతున్నాను - ఎవరయినా తన కోపతాపాల బారి నుండి పొరుగువారికి రక్షణ నివ్వనంతవరకూ స్వర్గానికి పోలేడు.'

13. విశ్వాసి అయినవాడు తన అతిథికి మర్యాద చేయాలి.

14. అవిశ్వాసి (కపటి, మునాఫిక్) ఆనవాళ్ళు మూడు : (1) వాడు పలికితే అసత్యమే పలుకుతాడు. (2) వాగ్దానానికి విరుద్ధంగా చేస్తాడు. (3) తన దగ్గర భద్రపరచబడిన (అప్పగింత) సొమ్మును తన స్వయం కోసం వాడుకుంటాడు.

పై హదీసుల్లోని ఒక్కొక్క హదీసును శ్రద్ధగా గమనిస్తే ఇస్లాం మరియు ఈమాన్ యొక్క నైతిక భావన ఎంత ఉన్నతమైనదో బోధపడుతుంది.

నైతిక విషయాలకు సంబంధించి ఇస్లాం ఖరారు చేసిన మరో విశేషమేమిటంటే, మనిషి వాటిని నెరవేర్చేటప్పుడు అవి దైవాదేశాలని భావించి మరీ నెరవేర్చాలి.

ఒక బాటసారిని ఆదుకోవడాన్ని గానీ, ఒక రోగగ్రస్తుని సేవ చేయడాన్ని గానీ - అది దేవుని ఆజ్ఞగా తలపోసి మరీ చేయాలి. మరి ఆ సేవలో నిమగ్నుడైన వాని అంతరాత్మ సయితం ఆ మేరకు ప్రబోధించాలి. నిలువెల్లా అతడు ఆ పని కొరకు చిత్తశుద్ధితో సమాయత్తం కావాలి. ఆ పని చేస్తున్నందుకు అతని మనసు సంతోషంతో పులకించాలి. ఇలాంటి సత్కార్యాలకుగాను తాను కేటాయిస్తున్న సమయంలో ఒక పెద్ద మానవ సమూహానికి మేలు కలుగుతుందన్న అనుభూతికి అతను లోను కావాలి. చెప్పవచ్చిందేమిటంటే, మంచి విషయంలో అతని మనోవాక్కాయ కర్మలు ఎంత ఎక్కువగా సమరసం చెందుతాయో అంతే ఎక్కువగా అతని ఆధ్యాత్మికత పరిణతి చెందుతుంది. ఒకవేళ ఆ సమరసం గనక వాటి మధ్య సన్నగిల్లినట్లయితే అతని ఆధ్యాత్మికతలో, విశ్వాసంలో ఎక్కడో ఏదో వెలితి ఉందన్నమాట!

ఒక సత్కార్యాన్ని మనం దైవాజ్ఞ అని తలపోసి చేయడానికైతే చేస్తున్నాము. కాని మన మనస్సాక్షి దాన్ని సత్కార్యంగా తలపోయటం లేదు, పైగా మన బుద్ధి దానికి విరుద్ధంగా మనకు మార్గం చూపుతోందనుకోండి - దాని అర్థం ఏమిటీ? అంటే - అది నిజంగా దైవాదేశం అయి ఉంటుందనే విషయంలో మనకింకా నమ్మకం కుదరలేదన్నమాట!

**('కారుణ్య కడలి' పుస్తకం నుండి)**

# అశ్లీలతకు వ్యతిరేకంగా ఓ గొప్ప ఉద్యమం అవసరం

మూలం :
ముహియ్యుద్దీన్ గాజీ

అనువాదం :
ఆలియా బిన్తె మునీర్ షర్ఫియ

### నైతికతా విలువలు మానవత్వ ఆభరణాలు

మనిషి తన గోప్య అవయవాలను కప్పుకోవడానికి దుస్తులు ధరిస్తాడు. మనిషి సంభోగాన్ని నాలుగు గోడల మధ్య జరుపు కుంటాడు. మనిషి తన పవిత్రత గురించి ఆలోచిస్తూ ఉంటాడు. మనిషి పై శారీరక అత్యాచారం పెద్ద నేరంగా భావించబడు తుంది. ఇవన్నీ మనిషి ప్రత్యేకతలు. జంతువుల పరిస్థితి ఇలా ఉండదు.

అల్లాహ్ మనిషికి గౌరవోన్నతులు ప్రసాదించాడు. గౌరవోన్నతుల వ్యక్తీకరణలో అత్యున్నత నైతిక విలువలు, న్యాయ శీలత, సిగ్గు బిడియాలు, పవిత్రత, దుస్తులు పరదా వంటివన్నీ ఉన్నాయి. మనిషి ఎంతో ఉన్నతుడు. అందుకే ఇవన్నీ అతని స్వభావంలో ఇమిడి ఉన్నాయి.

కింద పేర్కొనబడిన రెండు వాక్యాలను పఠిస్తే దృశ్యకావ్యం స్పష్టమై పోతుంది:

మేము ఆదము సంతతికి పెద్దరికాన్ని ప్రసాదించాము. వారికి నేలపై, నీటిలో నడిచే వాహనాలను ప్రసాదించాము. వారికి పరిశు ద్ధమైన వస్తువులను ఆహారంగా ఇచ్చాము. మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము.

ఆదము సంతానమా! మేము మీపై దుస్తులను అవతరింప జేశాము. అవి మీరు సిగ్గుపడే మీ శరీర భాగాలను కప్పుతాయి. మీ శరీర రక్షణకు శోభకు సాధనంగా ఉంటాయి. భయభక్తులు అనే దుస్తులే మంచి దుస్తులు. ఇది అల్లాహ్ సూచనలోని ఒక సూచన. (7:26)

దుస్తులు, మనిషికి మాత్రమే ప్రత్యేకం. సృష్టి రాశులన్నింటిలో కేవలం మనిషి మాత్రమే దుస్తులను ధరిస్తాడు. ఏ పశువు దుస్తులను ధరించదు.

పశువులు దుస్తులు ధరించకుండా తిరిగితే అది అశ్లీలత కాదు. మనిషి దుస్తులు లేకుండా తిరగడం అశ్లీలతే అవుతుంది. పశు వులు బహిరంగంగా సంభోగ కార్యక్రమం చేయడం నీతి బాహ్యమైన చేష్ట కాదు, కానీ మనిషి ఒకవేళ ఇలా చేస్తే అది ఖచ్చితంగా నీతిబాహ్యమైన చేష్టే.

ప్రస్తుతం మానవ ప్రపంచంలో అశ్లీలత, నీతిబాహ్యమైన చెడు గాలులు వీస్తున్నాయి. ఈ విషపూరిత గాలులు మనిషిని సిగ్గు బిడియాల భావనల నుంచి దూరం చేయడంలో ఒక దానికి మించి మరొకటి పోటీ పడుతున్నాయి.

అశ్లీల ధ్వజవాహకులు సిగ్గుబిడియాలు, దుస్తులు, హిజాబ్‌లను అవి మనుషుల స్వయం కల్పిత కట్టుబాట్లలా చూపిస్తున్నారు. వాటి నుంచి వారు విముక్తి పొందాలని ప్రోత్సహిస్తున్నారు.

వారు మనుషులను ఈ కట్టుబాట్లతో జీవనం కొనసాగించ కూడదు అని నమ్మిస్తారు.

వారి దృష్టిలో మనిషి ఇతర పశువుల వలే కేవలం ఒక పశువు మాత్రమే. అందుకే పశువులకు ఉన్న స్వేచ్ఛ మనుషు లకు కూడా ఉండాలని భావిస్తారు.

మనుషులు పశువులలో పెద్ద తేడా ఉంది. మనిషి స్వేచ్ఛను కలిగి ఉంటాడు. పశువులకు స్వేచ్ఛ లేదు. ప్రత్యేక ప్రవృత్తిలో బంధించబడి ఉంటాయి. మనిషి గౌరవోన్న తులు కలిగి ఉ ంటాడు. పశువులు గౌరవోన్నతుల భావనే కలిగి ఉండవు. మనిషి ఎప్పటికీ పశువు కాలేడు, పశువు ఎప్పటికీ మనిషి కాలేదు.

పశువు ఒకవేళ దుస్తులు ధరిస్తే మనిషిలా మారదో అలాగే మనిషి దుస్తులు ధరించకుండా పశువు అయిపోడు. అయితే మనిషి అశ్లీల పద్ధతిని పాటించడంతో అల్లాహ్ తరపున ప్రత్యేకంగా ప్రసాదించబడిన గౌరవాన్ని కోల్పోతాడు. అవమానంతో కూడుకున్న మార్గాన్ని ఎంచుకుంటాడు. తత్ ఫలితంగా దీనిని వ్యధాభరితమైన శిక్ష రూపంలో తర్వాత అనుభవిస్తాడు.

ఏ మనిషి అయితే అల్లాహ్ గ్రంథాన్ని ఆలకించడో, అర్థం చేసుకోడో అతనిని ఖుర్ఆన్ పశువులతో పోల్చింది. కానీ అశ్లీలత, నీతి బాహ్యమైన చేష్టలను ఎంచుకునే మనుషులను పశువులతో పోల్చలేదు. చూడడం, వినడం, ఆలోచించడం, అర్థం చేసుకోవడం ఆపేసిన మనిషి పశువుల వలె మారిపోతాడు. వినే శక్తి, ఆలోచించే శక్తి, బుద్ధి కుశలతలు వీటికి దూరమైపోతే ఇద్దరు ఒకే మాదిరి అయిపోతారు. వ్యత్యాసం ఏమిటంటే పశువులకు అవన్నీ లభించలేదు, మనుష్యులు వాటిని వినియోగించరు. ఈ విధంగా ఇద్దరు వీటిని కోల్పోవడంలో సరి సమానమైపోతారు.

అశ్లీలత, నీతి బాహ్యమైన పద్ధతులను ఎంచుకునేవారు అత్యుత్తమ మనుష్యుల స్థాయి నుండి నీచమైన మనుషులుగా మారిపోతారు. వారు పశువులతో పోల్చబడరు. ఎందుకంటే పశువులు ఏ విధంగానైతే సిగ్గు బిడియాలను, పవిత్రతను కలిగి ఉండవో అదేవిధంగా అశ్లీలం, అసభ్యత ఇవి కూడా వాటి గుణాలు కావు.

## గౌరవోన్నతమైన మానవ సమాజం:

మానవ సమాజానికి గౌరవోన్నత్యాలున్నాయి. మనిషి ఒక కుటుంబంలోని భాగం. కుటుంబం పటిష్టంగా ఎప్పటికీ నిలిచి పోయే బంధాలతో ఉంటుంది. ఇవి తరతరాల వరకు నిలిచి పోతాయి. మనుష్యుల మధ్య పొరుగువారి బంధం కూడా ఎంతో ప్రధానమైనది. మానవ సమాజం తన ప్రత్యేక రూపాన్ని కలిగి ఉంటుంది.

మానవ సమాజ దృఢత్వానికై నైతిక విలువలు అత్యంత ఆవశ్యకం. న్యాయం లేకపోతే మానవ సమాజం వైర్యం, శత్రుత్వాల అగ్నిలో కాలిపోతుంది. నైతిక విలువలతో విసుగు చెందితే మానవ సమాజం గౌరవాన్ని కోల్పోతుంది. తదుపరి అందులో "బలవంతుడు బలహీనుణ్ణి తినేస్తాడు" లాంటి దుస్థితి ఏర్పడు తుంది. నైతిక విలువలు లేని మానవ సమాజం క్రూర మృగాల కంటే ప్రమాదకరంగా తయారవుతుంది. క్రూర మృగాల ప్రవృత్తికి ఒక హద్దు ఉంటుంది, అది జీవన సంతులనాన్ని విచ్ఛిన్నం చేయదు. కానీ మానవ సమాజ విచ్ఛిన్నం యావత్ ప్రపంచాన్ని నాశనం చేస్తుంది. మనిషిలో నిర్మాణం, విచ్ఛిన్నం రెండు సామర్థ్యాలు ఇంకే సృష్టిరాశిలో లేనట్టుగా ఇమడ్చబడ్డాయి. నైతికత నిర్మాణ మార్గాలను సుగమం చేస్తుంది. అనైతికత విచ్ఛిన్నతవైపు తీసుకు వెళుతుంది. నైతికత మార్గంలో మనిషి సఫలు డవుతాడు, గౌరవం పొందుతాడు .నైతికత లేకపోతే మనిషి అవమానం పాలవుతాడు, పతనానికి గురవుతాడు.

## సిగ్గు బిడియాలు మానవ సమాజ రక్షణ కవచాలు

సిగ్గు బిడియాలు పాటిస్తున్న ఒక సమాజాన్ని మీరు ఊహించు కోండి. ఆ సమాజం మనుషుల కొరకు శాంతియుతంగా, పరిశుభ్రంగా ఉంటుంది. ఈ సమాజంలో మనుషుల గౌరవం, ప్రాణాలు, ఆస్తులు అన్ని క్షేమంగా ఉంటాయి. మహిళలకు, పిల్లలకు ఇంటిలో, ఇంటి బయట కూడా ఎటువంటి భయాందోళనలు ఉండవు. దీనికి భిన్నంగా సిగ్గు బిడియాలు లేని ఒక సమాజాన్ని ఊహించుకోండి. అక్కడ మనోవాంఛలు రాజ్యమేలుతాయి. విచ్చలవిడితనం ప్రబలుతుంది, మంచి, చెడు నడవడికల వ్యత్యాసం అంతమైపోతుంది. అటువంటి చోట ఒకరి గౌరవం, ధనప్రాణాలు ఎలా క్షేమంగా ఉంటాయి?

అక్కడ మహిళలు, పిల్లలు క్షేమంగా ఉండలేరు. ఇంటిలో, ఇంటి వెలుపల శాంతి ఉండదు.



స్వేచ్ఛ గురించిన తప్పుడు ఆలోచన, స్వేచ్ఛ దుర్వినియోగం వైపునకు తీసుకు వెళుతుంది. స్వేచ్ఛను దుర్వినియోగ పరిస్తే పూర్తి మానవ సమాజం. ఈ ప్రపంచపు పూర్తి ఎకోసిస్టమ్ వినాశనమే అవుతుంది. పూర్తి మానవ చరిత్ర దీనికి సాక్ష్యం.

## అశ్లీల కార్యాల గురించి ఖుర్ఆన్ బోధనలు

వ్యభిచారిని గురించి ఖుర్ఆన్ బోధనలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఖుర్ఆన్‌లో ప్రతి అశ్లీల కార్యాన్ని అధర్మంగా ప్రకటించింది. అవి పెద్ద పనులైనా లేక చిన్న పనులైనా, బహిర్గతమైన లేక గోప్యంగా ఉన్న, అవి అశ్లీలమైనవని స్పష్టమై పోయినా లేదా అస్పష్టంగా ఉన్నా:

ప్రవక్తా! వారితో ఇలా అను: నా ప్రభువు నిషేధించినవి ఇవి: సిగ్గుమాలిన పనులు- బహిరంగమైనవి కాని, లేక గుప్తమైనవి కాని.(7:33)

అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి, బహిరంగమైన వైనా సరే లేక గోప్యమైనవైనా సరే.( 6:151)

దారిద్ర్య ప్రమాదం చూపి షైతాను మిమ్మల్ని భయపెడతాడు. నీతి బాహ్యమైన, నీచమైన మార్గం అవలంబించండి అని ప్రేరేపిస్తాడు. (2:268)

షైతానును ఎవరైనా అనుసరిస్తే వాడు అతనికి అశ్లీలతనే చెడునే ఆజ్ఞాపిస్తాడు. (24:21)

ఖుర్ఆన్ ఒక ప్రధానమైన నియమం ఏమని చెబుతుందంటే అల్లాహ్ తరపునుంచి ఏ విధమైన అశ్లీల కార్యానికి అనుమతి దొరక లేదు, అల్లాహ్ తరపున పంపబడిన షరీఅత్ లో కూడా దానికై అనుమతి లేదు, అలాగే అల్లాహ్ సృష్టించినటువంటి మానవ స్వభావం కూడా దానిని ఇష్టపడదు.

ఏదైనా సిగ్గు మాలిన పని చేసినప్పుడు ఈ ప్రజలు ఏమంటారంటే, "ఈ పద్ధతినే మా తాత ముత్తాతలు అవలంబిస్తూ ఉండగా మేము చూసాము. ఇలా చెయ్యండి అని అల్లాహ్‌యే మమ్మల్ని ఆదేశించాడు." వారితో ఇలా అను: " సిగ్గుమాలిన పనిని అల్లాహ్ ఎన్నటికీ ఆదేశించడు. అల్లాహ్ తరపు నుండి వచ్చాయని మీకు తెలియని ఆ విషయాలను మీరు అల్లాహ్ పేరుతో ప్రకటిస్తున్నారేమిటి?"(7:28)

అల్లాహ్ అశ్లీల చేష్టలను నిషేధిస్తున్నాడని ఖుర్ఆన్ స్పష్టంగా తెలుపుతుంది:

అల్లాహ్ చెడును, అశ్లీలతను నిషేధిస్తున్నాడు. (16:90)

నమాజ్ కూడా అశ్లీల విషయాలనుంచి వారిస్తుంది. నిశ్చయంగా నమాజు అశ్లీల కార్యాల నుండి చెడు పనుల నుండి నిరోధిస్తుంది. (29:45)

అల్లాహ్ ఇష్టపడే దాసులు ఎవరంటే వారు అశ్లీల కార్యాలకు దూరంగా ఉంటారు:

ఎవరైతే పెద్ద పెద్ద పాపాలకూ , సిగ్గుమాలిన పనులకూ దూరంగా ఉంటారో (42:37)

ఒకవేళ ఎప్పుడైనా అశ్లీల పాపకార్యం దొర్లిపోతే తదుపరి దాసుడు వెనువెంటనే అల్లాహ్‌ను స్మరించి, తమ పాపాల ఎడల క్షమాపణ కోరుకుంటే అల్లాహ్ కేవలం క్షమాభిక్ష పెట్టడమే కాకుండా అతని కొరకు స్వర్గపు శుభవార్త కూడా వినిపించాడు.

మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు, స్వర్గం వైపునకు పోయే మార్గంలో పరిగెత్తండి. ఆ స్వర్గం భూమ్యాకాశాల అంత విశాలమైంది. అది భయభక్తులు కలవారి కొరకు తయారు చేయబడింది. వారు కలిమిలో, లేమిలో, ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చు చేసేవారు, కోపాన్ని దిగమ్రింగే వారు, ఇతరుల తప్పులను క్షమించే వారు - ఇలాంటి సజ్జనులు అంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం - వారి స్థితి ఎలా ఉంటుందంటే, ఎప్పుడైనా ఏదైనా అశ్లీల కార్యం వారివల్ల జరిగిపోతే లేదా ఏదైనా పాపం చేసి, వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లయితే, వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అప్పుడు వారు ఆయనను తమ తప్పులు క్షమించు అని వేడుకుంటారు- ఎందుకంటే అల్లాహ్ తప్ప పాపాలను క్షమించగలిగే వాడెవడున్నాడని - వారు తాము చేసిన తప్పులను గురించి బుద్ధిపూర్వకంగా మొండివాదం చెయ్యరు. అలాంటి వారికి తమ ప్రభువు వద్ద లభించే ప్రతిఫలం ఏమిటంటే ఆయన వారిని క్షమిస్తాడు. క్రింద సెలయేళ్లు ప్రవహించే ఉద్యాన వనాలలోకి వారిని ప్రవేశింపజేస్తాడు. వారు అక్కడ శాశ్వతంగా ఉంటారు. మంచి పనులు చేసే వారికి ఎంత చక్కని ప్రతిఫలం. (3: 133- 136)

ఎవరైతే ఏదైనా అశ్లీల కార్యాలలో మునిగిపోయి ఉంటారో, ఇక ఇందులో నుంచి బయటికి వచ్చి పరిశుద్ధమయ్యే మార్గం ఏది లేదని భావిస్తారో వారి కొరకు ఈ వాక్యాలు గట్టి నమ్మకాన్ని చేకూరుస్తాయి. ఈ వాక్యాలు వారికి కేవలం పరిశుద్ధమయ్యే నమ్మకంతో కూడిన సందేశాన్ని ఇవ్వడమే కాకుండా వారు స్వర్గపు వరాలకు అర్హులు అవుతారని కూడా సందేశం ఇస్తాయి. షరతు ఏమిటంటే వారు వెనువెంటనే పశ్చాత్తాపం చెంది తమను తాము సంస్కరించుకోవాలి. పశ్చాత్తాపం చెందడంలో ఆలస్యం వహించడం వారి కొరకు అత్యంత ప్రమాదకరం కావచ్చు.

**(మిగతా వచ్చేవారం)**

# మనిషిలోని మనసు : మూడు దశలు

-ఎస్.ఎమ్.మలిక్

➢ దైవం ప్రతి వ్యక్తి ఆంతర్యంలో సత్యసందేశ దాత తరఫున ఓ ప్రతినిధిని పెట్టాడు. ఆ ప్రతినిధిని మేల్కొల్పడమే సందేశదాత చేయవలసిన అసలు పని. ఆ ప్రతినిధి- 'నఫ్సుల్లవ్వామ', అధిక్షేపించే మనస్సు!

➢ ప్రతి వ్యక్తి ఆంతర్యంలో షైతాన్ ప్రతినిధికి కూడా చోటు కల్పించడం జరిగింది. వాడు ఆదిలోనే కోరుకున్న అనుమతి మేర వాడికి ఆ సౌలభ్యం కల్పించడం జరిగింది. ఆ ప్రతినిధి- 'నఫ్సుల్ అమ్మార'. చెడును పురికొలిపే మనస్సు!!

➢ మనిషి ఆంతర్యంలో మనిషికే చెందిన మనస్సు కూడా ఉంది. అది దైవమే తన ప్రభువు అని, ప్రవక్తలు అందజేసిన దైవ విధేయతా మార్గం, ఇస్లామ్ మాత్రమే తన జీవన మార్గమని చివరి దైవప్రవక్త ముహమ్మద్(స), ఇంకా సమస్త దైవప్రవక్తలు అందరూ నిజమయిన ప్రవక్తలు, దైవ సందేశహరులని విశ్వసించి తృప్తి చెందిన, సంతుష్టి పొందిన మనస్సు-'నఫ్సుల్ ముత్‌మయిన్న' సంతుష్ట మనస్సు!!!

### అమ్మారా

ఆంతర్యం ఆశల ఖజానా, కోరికల భాండాగారం, మనిషి సతతం ఏవో ఆశిస్తుంటాడు, అతనికి లభించేవి కొన్నయితే ఆలోచనల్లోనే తిష్ట వేసుకుని కూర్చున్న ఈడేరని కోరికలు ఎన్నెన్నో. కొన్ని కోరికలు అందినట్లే అంది చెయ్యి దాటిపోతుంటాయి. షైతాన్ ప్రతినిధి వీలు కాని కోరికల్ని, వక్రమార్గాన ప్రాప్తించే వాటినీ ప్రేరేపిస్తూ ఉంటాడు. మనిషి కోరికల పిచ్చిలో పడి ఏ విధంగానయినా ఆ కోరికల్ని ఈడేర్చుకోవాలని ప్రయత్నాలు మొదలెడతాడు, షైతాన్ ప్రతినిధి తోడ్పడి మనిషిని ఆ చెడు దారిని సుగమం చేసే విధానాలనూ ప్రేరేపిస్తాడు. అదో ఆ సమయానే అధిక్షేపించే మనస్సు కార్యశీలత పరీక్షకు గురవుతుంది. అధిక్షేపించే మనస్సును జోకొట్టి నిద్రలో ముంచిన చెడుల ప్రేరక మనస్సు అధిక్షేపించే, సందేశదాత ప్రతినిధిని తొక్కి పెడుతుంది.

### లవ్వామా

సందేశదాత జాగరూకతతో, వివేచనతో మనిషి ఆంతర్యంలోని తన ప్రతినిధిని నిద్రలేపే ప్రయత్నం చేయాలి. గట్టి ప్రయత్నం జరిగితే ఆంతర్యంలో అధిక్షేపక మనస్సు మేల్కొని మనిషిని హెచ్చరిస్తుంది. చెడు పరిణామాలను గురించి సావధానపరుస్తుంది. దుష్ప్రేరక మనస్సు గొంతెమ్మ కోరికల్ని మన్నిస్తే జరిగే కీడును ప్రత్యక్షంగా చూపిస్తుంది. అప్పటికీ అది చెయ్యి దాటుతున్నట్లు అనిపిస్తే ఘాటుగా అధిక్షేపించేందుకు యత్నిస్తుంది. భయపెడుతుంది, బెదిరిస్తుంది. మనిషి కళ్ళు తెరుస్తాడు, చెడు దారి నుండి మరలుతాడు, మంచి వైపునకు అడుగు వేస్తాడు!

### ముత్మయిన్న

ఆ క్షణంలో మనిషికి గుర్తుకు వస్తాయి, తాను దైవాన్ని నమ్మే వాడనని, ప్రవక్తలు అందజేసిన విధేయతా ధర్మాన్ని విశ్వసించ వలసిన వాణ్ణని, తాను తన ప్రభువుకు జవాబు చెప్పుకోవలసి ఉందని, మనసుగొనిపోయే మార్గం ఇహపరాలలో హానికరమని మనిషి గ్రహిస్తాడు. ఈ గ్రహింపు కలుగజేసేవాడు వాస్తవానికి సందేశదాత!

అతని వివేచన, ప్రేరణల వల్లనే ఆంతర్యంలోని అధిక్షేపించే అంశం మేల్కొన్నది, మనిషినీ తట్టి లేపింది. వాస్తవికతా స్పృహ కలిగించింది. మనిషి చెడు దారి నుండి మరలగలిగాడు!

దివ్య ఖుర్‌ఆన్ మనస్సులోని ఈ మూడు అంశాలను ఎత్తి చూపుతుంది.

### నఫ్సుల్ అమ్మార

"నేను నా మనస్సు నిరపరాధి అని చాటడం లేదు, మనసయితే చెడులకు ఉసిగొలుపుతూనే ఉంటుంది." (యూసుఫ్ : 12:53)

### నఫ్సుల్ లవ్వామ

"అది కాదు, నేను అధిక్షేపించే మనస్సు పట్ల ప్రమాణం చేసి (చెబుతున్నాను)." (అల్ కియామ 75:2)

### నఫ్సుల్ ముత్మయిన్న

"ఓ సంతుష్ట మనస్సా! పద, నీ ప్రభువు వైపునకు, ప్రసన్నంగా, (నీ ప్రభువు) అనుమోదం పొంది...". (అల్ ఫజ్ర్ 89: 27,28)

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

84 – 85 ఆ ఒక్కడే ఆకాశాలలోనూ దేవుడు, భూమిలోనూ దేవుడు, ఆయనే మరాయనే వివేచనావంతుడు, జ్ఞాన సంపన్నుడూను.[65] మహోన్నతుడు, మహిమాన్వితుడు ఆయన భూమీ ఆకాశాలు, భూమీ ఆకాశాల మధ్యనున్న ప్రతి వస్తువు పరిపాలనాధికారమూ ఆయన అధీనంలోనే ఉంటుంది.[66] ఆయనే ప్రళయ ఘడియ జ్ఞానమున్నవాడున్నూ, ఆయన వైపునకే మీరందరూ మరలించి పంపబడనున్నారు.[67]

86 ఆయన్ని వదిలి వీరు వేటినయితే వేడుకుంటున్నారో అవి ఎటువంటి సిఫారసు చేసే అధికారం కలిగి లేవు, ఎవరయినా జ్ఞానం ఆధారంగా సత్యానికి సాక్ష్యమిస్తే తప్ప.[68]

65. అంటే, భూమికీ ఆకాశాలకూ వేర్వేరు దేవుళ్ళు లేరు. సకల విశ్వానికీ ఒకే దైవం. ఆయన విజ్ఞతే యావత్తు విశ్వవ్యవస్థలో ప్రచలితమయి ఉంది. ఆయనే సమస్త వాస్తవికతలను ఎరిగిన వాడు.

66. ఆయన అస్తిత్వం ఎంతో మహోన్నతమయింది; ఆయన దైవత్వంలో ఎవరయినా ఆయనకు సహవర్తులవడం అనే విషయానికి ఆయన అతీతుడు. ఈ మహోజ్వలమయిన విశ్వవ్యవస్థ పరిపాలనలో ఆయనతో పాటు ఏ మాత్రమయినా జోక్యం కలిగి వున్న వారెవరయినా ఉండటం అన్న దానికీ ఆ వ్యక్తిత్వం ఎంతో అతీతమయినది. భూమీ ఆకాశాలలో ఉన్నదంతా, ఉన్నవారంతా వారు ప్రవక్తలయినా, మహాభక్తులయినా, దైవదూతలయినా, జిన్నులూ ఆత్మలయినా, నక్షత్రాలూ, గ్రహాలయినా, సర్వం ఆయనకు దాసులే, బానిసలే, ఆజ్ఞాబద్ధులే. వీరిలో ఎవ్వరూ దైవ గుణగణాలు కలిగి, దేవుని అధికారాలు కలిగి ఉండటం అన్నది రవ్వంతయినా సాధ్యం కాని విషయం.

67. అంటే ప్రపంచంలో మీరు ఎవరిని తమ సమర్థకులుగా, సంరక్షకులుగా చేసుకున్నా మరణించిన తరువాతమటుకు ఆ ఒకే దైవాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. ఆయన న్యాయస్థానంలోనే మీరు తమ ఆచరణల జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

68. ఈ వాక్యానికి ఎన్నో భావాలు :

ఒకటి, జనులు ప్రపంచంలో ఎవరెవరినయితే ఆరాధ్యులుగా చేసుకున్నారో వారంతా అల్లాహ్ సన్నిధిలో సిఫారసు చేసేవారు కారు. వారిలో ఎవరయితే మార్గవిహీనులో, భ్రష్టమార్గాన్ని అవలంబించే వారో వారు స్వయంగానే అక్కడ అపరాధులుగా ముందుకు వస్తారు. అయితే ఎవరయితే జ్ఞానంతో పాటు (ఏమీ తెలియకుండా, ఏమీ అర్థం చేసుకోకుండా కాదు) సత్య సాక్ష్యం ఇస్తారో వారక్కడ తప్పక ఇతరులకు సిఫారసు చేసేందుకు అర్హులయి ఉంటారు.

రెండు, ఎవరికయితే సిఫారసు చేసే అధికారం ఉంటుందో వారున్నూ కేవలం ప్రపంచంలో అంతా పూర్తి ఎరుకతో, అవగాహనతో (ఏమరుపాటుగా అనాలోచితంగా కాదు) సత్యానికి సాక్ష్యం పలికినవారి విషయంలో మాత్రమే సిఫారసు చేయగలరు. వారు, ప్రపంచంలో సత్యానికి దూరంగా మసలుకునే వారిని, లేదా ఏమీ తెలియకుండా, అర్థం చేసుకోకుండా అంటూనే దానితో పాటు ఇతర దైవాల దాస్యమూ చేస్తూ ఉన్న వారికి వారూ సిఫారసు చేయరు; ఇటువంటి వారికి సిఫారసు చేసే అధికారమూ వారికి ఉండదు.

మూడు, ఎవరయినా తాను ఆరాధ్యులుగా చేసుకున్న వారు తప్పకుండా సిఫారసు చేసే అధికారాలు కలిగి ఉన్నారని, అల్లాహ్ సన్నిధానంలో వారికి బలమూ ఉందని, తాము కోరిన వారిని వారు క్షమింపచేసుకోగలుగుతారని, వారి ఆచరణలు ఏ విధంగా ఉన్నప్పటికీ, వారి నమ్మకాలు ఎలాంటి వైనప్పటికీ వారికి ముక్తి కలిగింప చేసుకుంటారని చెబితే అలా అనేవారు చెప్పేదంతా తప్పు. ఇటువంటి స్థానం అల్లాహ్ సన్నిధిలో ఎవ్వరికీ లేదు. ఎవరయినా ఒక వ్యక్తికి ఇలాంటి అధికారాలున్నాయని, అతను జ్ఞానం ఆధారంగా ఇటువంటి మాట పలుకుతున్నట్లు వాదిస్తే, ఈ మాటకు వాస్తవికతా ఆధారమయిన సాక్ష్యం ఇవ్వగలిగితే అతను సాహసించి ముందుకు రావాలి. కాని అతను ఇటువంటి సాక్ష్యం సమర్పించ లేకపోతే, నిశ్చయంగా అతను సాక్ష్యం ఇచ్చే స్థాయిలో లేడని ఖచ్చితంగా చెప్పవచ్చు. అలాంటప్పుడు కేవలం వినికిడి మాటల ఆధారంగా, లేదా ఏదో ఊహలు, భ్రమల ఆధారంగా ఇటువంటి నమ్మకం సృష్టించుకోవడం ఆసాంతం వ్యర్థం, ఇటువంటి ఊహాజనితమయిన నమ్మకాల ఆధారంగా తమ పరలోకాన్ని ప్రమాదంలో పడవేసుకోవడం నిశ్చయంగా శుద్ధ అవివేకం.

**68వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం

(కితాబుల్ మగాజీ)

### ఉహుద్ యుద్ధం

**659)** హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) కుమారుడు ఇబ్రాహీమ్ తెలిపారు: (తన తండ్రి) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ముందు (ఇఫ్తార్) భోజనం సమర్పించబడింది. ఆ రోజు ఆయన ఉపవాసం ఉన్నారు. ఆయన ఇలా అన్నారు: "ముస్అబ్ బిన్ ఉమైర్-రజి (ఉహుద్ పోరాటంలో) అమరగతి నొందారు. ఆయన నాకన్నా గొప్పవారు. కాని ఆయనకు కఫన్‌గా చుట్టబడిన దుప్పటి ఎంత కురచగా ఉందంటే, ఆయన తలపై దానిని కప్పితే కాళ్ళు కనిపించేవి. కాళ్ళపై కప్పితే తల కనిపించేది". హమ్జా (రజి)ను కూడా ఆయన ఆ సందర్భంగా తలచుకున్నారని నా అనుమానం. "హమ్జా (రజి) నాకన్నా ఉత్తములు. (అదే యుద్ధంలో) ఆయన కూడా అమరగతినొందారు." కాని ఆ తర్వాత ఏం జరిగిందో మీరు చూస్తూనే ఉన్నారు. ప్రపంచంలో మాకు కలిమి నొసగబడింది. లేదా ఇలా అన్నారు: మాకు ప్రపంచం పుష్కలంగా ప్రసాదించబడటం మీరు చూస్తున్నారు. మేము చేసుకున్న సత్కార్యాలకు గాను మాకు ప్రాపంచిక సిరులు ఇక్కడే తొందరగా ఇవ్వబడ్డాయేమో అని నాకు భయమేస్తోంది- ఇలా చెప్పిన తర్వాత ఆయన చాలా సేపటివరకు విలపిస్తూనే ఉండిపోయారు. భోజనం కూడా చేయలేకపోయారు.[1]

**660)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) చెప్పగా అమ్ర్ బిన్ దీనార్ విన్నారు (జాబిర్ ఇలా అన్నారు): ఒక సహచరుడు ఉహుద్ యుద్ధ దినాన దైవప్రవక్త (సఅసమ్)తో, 'యా రసూలల్లాహ్! నేను గనక యుద్ధంలో వధించబడితే ఆ తర్వాత ఎక్కడికెళతాను?' అని అడిగాడు. "స్వర్గానికి" అని దైవప్రవక్త(స) చెప్పారు. అంతే, అతను తన చేతుల్లో ఉన్న ఖర్జూర పండ్లను విసిరేసి రణరంగంలో దూకాడు. వీరోచితంగా పోరాడుతూ అమరగతినొందాడు.[1]

**663)** హజ్రత్ జైద్ బిన్ సాబిత్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉహుద్ యుద్ధం కొరకు బయలుదేరినప్పుడు, ఆయన(స) వెంట ఉన్న వారిలో కొందరు (ద్వంద్వనీతిపరులు సాకులు చూపి) వెనక్కి మరలారు. అలా వెనక్కి మరలిపోయిన కపటుల విషయంలో ప్రవక్త ప్రియసహచరుల(రజిఅల్లాహు అన్‌హుమ్) మధ్యన రెండు అభిప్రాయాలు ఏర్పడ్డాయి. 'అందరికన్నా ముందు మేము ఈ కపటులతో పోరాడాలి' అని ఒక వర్గం వారంటే, 'వారితో పోరాడరాద'ని మరో వర్గం వారన్నారు. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది: "మీకు ఏమయింది, మీ మధ్య కపటులను గురించి రెండు అభిప్రాయాలు ఉన్నాయి? వాస్తవానికి వారు సంపాదించుకున్న దుష్కర్మల ఫలితంగానే అల్లాహ్ వారిని వెనక్కు (పూర్వపు స్థితికి) మరలించాడు"[1] (4:88). మహాప్రవక్త ఇలా వక్కాణించారు: "మదీనా పవిత్ర (తయ్యిబా) నగరి. నిప్పుకొలను వెండిలోని కసువును తొలగించినట్లే అది తల బిరుసులను తన నుండి దూరం చేస్తుంది."

659-1. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) స్వర్గలోక శుభవార్త పొందిన పదిమంది సహాబా (అష్రె ముబష్షిరా)లో ఒకరు. అయినప్పటికీ ఆయన ముస్అబ్ బిన్ ఉమైర్(రజి)ను తనకన్నా గొప్పవానిగా చెప్పుకోటం ఆయనలోని వినమ్రతకు నిదర్శనం.

ఇక ముస్అబ్ బిన్ ఉమైర్(రజి)యువకుడైన సహాబీ. ఆయన హిజ్రత్‌కు ముందే మదీనాకు వెళ్ళి ధర్మ బోధకుని (దాయి)గా సేవలందించారు. ఆయన కృషి వల్ల మదీనాలో ఇస్లామ్ వేగంగా వ్యాపించింది.

660-1. 'ముస్లిమ్'లోని రివాయతు ప్రకారం ఆ వ్యక్తి పేరు ఉమైర్ బిన్ హుమామ్. యుద్ధ సమయంలో ఆ వ్యక్తి తినడానికి కొన్ని ఖర్జూర పండ్లు తీశాడు. కాని ఖర్జూర పండ్లు అయిపోయే వరకూ తాను ఆలస్యం చేస్తే, అది కూడా దౌర్భాగ్యమేనని భావించి కదన రంగంలో దూకాడు. వీరోచితంగా పోరాడుతూ వీర మరణం పొందాడు.

663-1. కపటుల నాయకుడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై, అతని అనుంగు అనుచరుల వెకిలి చేష్టల నేపథ్యంలో ఈ ఆయత్ అవతరించింది.




**అన్ని కాలాల్లో** స్త్రీపై అన్యాయం, దౌర్జన్యం జరిగింది. ఆమెకు సరైన హక్కులు లభించేవి కావు. ఎలాంటి గౌరవం ఆమెకు దక్కేది కాదు. ఒక్కొక్కసారి ఆమెను పాతాళంలోకి తొక్కివేస్తే మరొకసారి అందలానికి ఎక్కించేసేవారు. నేటి ఆధునిక కాలంలో కూడా జరుగుతున్నది ఇదే. ఆమె కోసం ఎప్పుడు ఎన్నో చట్టాలు మారుతూ ఉంటాయి. కానీ అన్నీ బూడిదలో పోసిన పన్నీరులే అవుతూ ఉంటాయి. ఆమెకు పురుషునితోపాటు సమాన హక్కులు కల్పించే ఉద్దేశం, ఆమెను ఇంటి గడప దాటిస్తే ఆమెను ఒక ఆట వస్తువుగానో, భోగ వస్తువుగానో చూడటం జరుగుతోంది. ఏది ఏమైనా ఆమె హక్కులు ఆమెకు లభించటం లేదు. ఆమెకు ఎల్లప్పుడూ సరైన హక్కులు కల్పించేవారెవరైనా లభిస్తారేమోనని ఆమె బిత్తరచూపులు చూస్తూ ఉండిపోతోంది.

ప్రపంచం ఉనికిలోకి వచ్చినప్పటి నుంచి ఎందరో ప్రవక్తలు వచ్చినప్పటికీ, వారు సమాజాన్ని సంస్కరించినప్పటికీ దైవప్రవక్త(స) గారి కాలంలో కూడా స్త్రీ దారుణమైన పరిస్థితిలో మాత్రమే మిగిలి పోయింది. తాను దౌర్జన్యాలు భరించటం తప్ప చేసేదేమీ లేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. చివరకు నవమాసాలు మోసి కన్న తన ఆడ శిశువు ప్రాణాలను సైతం కాపాడుకోలేని నిర్భాగ్య స్థితిలో, నెత్తుటి కన్నీళ్ళతో రోదిస్తూ ఉండిపోయి కనిపించింది.

దైవప్రవక్త(స) తన సమాజంలో జరుగుతూ ఉన్న ఈ దౌర్జన్యాన్ని చూసి మిన్నకుండిపోలేకపోయారు. ఆయన(స) చలించి పోయారు. ఎలాగైనా వాటిని అంతం చెయ్యాలని నిశ్చయించుకున్నారు. ప్రభువు దిశా నిర్దేశనం కోసం ఏకాంతంలో ఉండి ఎదురు చూడసాగారు. ఆయన(స)ను అల్లాహ్ ప్రవక్తగా ఎన్నుకున్నాడు. సమాజ సంస్కరణ బాధ్యతను ఆయనకు అప్పజెప్పాడు. స్త్రీ విషయంలోనైతే ఆది నుంచే ఆమెకు ఆయన ప్రసాదించిన హక్కులను, గౌరవాన్ని, స్థానాలను మరలా తెలియబరిచాడు. అవన్నీ ఆమెకు లభించేవిధంగా ప్రజలు వాటిని అమలు పరిచే విధంగా తీర్చిదిద్దమన్నాడు. ఇంకా వాటి కారణంగా లభించే బహుమానాలను కూడా తెలియజేయమన్నాడు. ప్రవక్త పదవిని అలంకరించిన తరువాత ఆయన(స) ప్రజలు వాటిని అమలు పరిచే విధంగా ప్రోత్సహించారు. దైవానుగ్రహాన్ని కూడా స్పష్టంగా తెలియజేశారు. దైవాగ్రహాన్ని కూడా స్పష్టంగా తెలియజేశారు.

మొట్టమొదట ఆయన(స) స్త్రీకు పురుషునితోపాటు సమానంగా జీవించేహక్కును కాలరాసి ఆమెను సజీవంగా పాతిపెట్టినట్లయితే పరలోక దినాన అతనికి అల్లాహ్ కఠినాతికఠినమైన శిక్షను నిర్ణయించి ఉంచాడని తెలియజేశారు. ఇంకా ప్రళయదినాన దుర్మార్గుడైన ఆ తండ్రి ముఖాన్ని కూడా తిరిగి ఆయన

చూడడని, పైగా ఆ పాతిపెట్టబడిన ఆ చిట్టిపాపను నీకు నీ దుర్మార్గుడైన తండ్రి ఏ పాపం చేసిన కారణంగా ఈ దుర్మార్గాన్ని ఒడిగట్టాడో చెప్పమని అడుగుతాడు. అప్పుడు ఆమె ఓ అల్లాహ్! నేను అప్పుడు పుట్టిన పసిపాపను కదా! నేనేమి పాపం చెయ్యగలను? నేను నీ ఆజ్ఞ ప్రకారం ఆడబిడ్డగా జన్మించడమే నా పాపం అని చెప్పుతుంది. ఇంకా ఆమెను ఏ విధంగా ఆమె తండ్రి నలిపివేశాడో, చిదిమివేశాడో ఒక్కొక్క క్షణ బాధను క్షుణ్ణంగా తెలియజేస్తుంది. నీచాతినీచుడైన తండ్రికి వ్యతిరేకంగా ఇచ్చిన ఆ చిట్టితల్లి సాక్ష్యాన్ని అల్లాహ్ ఆమోదించి ఎవ్వరూ కాపాడలేని కఠినాతి కఠినమైన శిక్షను విధించివేస్తాడు. కలకాలం అతను ఆ శిక్షను అనుభవించటం తప్ప మరే దారి అంటూ ఏదీ అతనికి లభించదు అని ఈ అల్లాహ్ ఆదేశాన్ని వారికి బోధించారు. ఇది విన్న ఆనాటి దైవ విశ్వాసులు చలించిపోయారు. అజ్ఞానంలో చేసిన ఘోరమైన తప్పును గ్రహించి బాధతో కుమిలిపోయారు. కన్నీటితో కారుణ్య ప్రభువును క్షమించమని వేడుకున్నారు. ఆ తరువాత పుట్టిన ప్రతి ఆడబిడ్డను, కొడుకులతో సమానంగా చూడసాగారు. ఈ విధంగా స్త్రీకు పుట్టుకతోనే గౌరవంగా జీవించేహక్కును కల్పించారు. ఇంకా ఆమె మీ మనసుకు శాంతిని, మీ కళ్ళకు చల్లదనాన్ని ప్రసాదిస్తుందని బోధించారు. ఆమె ద్వారా మీకు కారుణ్యమే లభిస్తుంది, ప్రయోజనం కలుగు తుంది తప్ప ఎలాంటి నష్టం గాని, కష్టంగానీ కలగదు అని కూడా తెలియజేశారు. ఇంకా ఎవరైనా ముగ్గురు కూతుళ్లను పెంచి పోషించి విద్యాబుద్ధులు నేర్పి వివాహాలు చేస్తాడో అల్లాహ్ అతనికి తప్పకుండా స్వర్గంలో ప్రవేశింపజేస్తాడనే శుభవార్తను కూడా తెలియజేశారు. ఇది ఒక్క కుమార్తె గల వారికీ ఇద్దరు కుమార్తెలు గల వారికీ వర్తిస్తుందని తెలియజేశారు. ఇదంతా తెలుసుకున్న తర్వాత ఎవడైనా తన కుమార్తెలను పెంచకుండా, ప్రేమించ కుండా ఉండగలడా? ఒక్కసారి ఆలోచించండి!

**రెండోది;** తల్లి విషయంలో కూడా ఆమె గౌరవాన్ని ఉన్నతమైనదిగా ఉందనే విషయాన్ని దైవప్రవక్త(స) తెలియజేశారు. కరుణామయుడైన అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల ఆయన ప్రస్తావన తరువాత తల్లిని ఆ తరువాత తండ్రిని ప్రస్తావించాడు అనే విషయాన్ని జ్ఞాపకం చేశారు. అల్లాహ్‌తోపాటు ఎవరినీ భాగస్వాములుగా చెయ్యకండి అనీ తల్లిదండ్రులతో ఉత్తమంగా మెలగండి అనీ, తల్లి పాదాల క్రింద స్వర్గముందని బోధించారు. ఆమెను సేవించి స్వర్గానికి అర్హులు కాగలరని ఉపదేశించారు. ఆమె చేతులెత్తి తమ సంతానం కోసం చేసే దుఆ వెంటనే దైవామోదాన్ని పొందగలదని తెలియజేశారు. తండ్రి కంటే తల్లి స్థానం మూడు రెట్లు అధికమని ఉపదేశించారు. ఆమె బిడ్డను నవ మాసాలు తన కడుపులో మోసి జన్మనిచ్చిన కార్యం విలువను ఆమె సంతానానికి తెలియజేస్తూ నీవు జీవితాంతం ఆమెకు సకల విధాల సేవ చేసినా ఆమె నీ కోసం పడిన పురిటినొప్పుల బాధలో నుంచి ఒక్క క్షణ బాధ రుణాన్ని కూడా నీవు తీర్చుకోలేవని స్పష్టంగా తెలియజేశారు. తల్లి స్థానాన్ని, విలువను ఇంతకు ఉన్నతంగా ఆయన(స) బోధించారు.

**మూడోది;** సోదరి హక్కు అతని అన్నపై ఉన్న విషయాన్ని తెలియజేశారు. అన్నా సోదరుల సంబంధం జీవితాంతం విడదీయరానిది. అది రక్త సంబంధంగా ముడివడి ఉందని, ఆమె బాగోగులలో, ఆమె కష్టసుఖాలలో, సంతోష సందర్భాలలో పాలుపంచుకోవటం అన్నపై ఉన్న విధి అని కూడా తెలియజేశారు. తల్లిదండ్రుల ఆస్తులలో నీతోపాటు నీ చెల్లికి భాగం ఉందని దానిని నీవు సంతోషంగా చెల్లించాలని కూడా బోధించారు. అంతేకాదు, తండ్రి తరువాత ఆమె బాధ్యత మొత్తం నీపై ఉన్నదని కూడా ఆదేశించారు. అనాథ చెల్లికి అన్నీ తానై పూర్తి బాధ్యతను తాను నెరవేర్చినట్లయితే కూతురి ద్వారా నీవు స్వర్గానికి అర్హులైనట్లు చెల్లి ద్వారా కూడా స్వర్గానికి అర్హులవ్వగలరని స్పష్టంగా తెలియజేశారు.

**నాలుగోది;** భార్య విషయంలో కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఆమె గౌరవాన్ని ఇనుమడింపజేశారు. ఒక స్త్రీ నీ కోసం పుట్టి పెరిగిన ఇంటిని, తల్లిదండ్రులను, అన్నాతమ్ముళ్ళు, అక్కాచెల్లెళ్ళను వదిలేసి నిన్ను సుఖపెట్టడానికి, నీ వంశాన్ని వృద్ధి చెయ్యటానికి, నీ ఇంటి వారికి సంతోషాలు ఇవ్వటానికి నీ ఇంటిని అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దటానికీ నీ వద్దకు వచ్చిన ఆమె త్యాగాన్ని గ్రహించి ఆమెతో ప్రేమగానూ, గౌరవంగానూ మెలగమని బోధించారు ఆయన(స). ఇంకా నీ వివాహ బంధంలో నీ భార్యగా వచ్చిన మరుక్షణం నుంచే ఆమె రక్షణ బాధ్యత, ఆమె పోషణ బాధ్యత, ఆమె అవసరాల బాధ్యత మొత్తం నీపైనే ఉందని మరీ బోధించారు. ఇది నీపై ఎలాంటి బరువు బాధ్యత కాదు. దీని కారణంగా నీకు లభించే స్వర్గంలో స్థానాలను పెంచే కార్యమని, అల్లాహ్ సంతోషానికి అర్హుడయ్యే బాధ్యత అని భర్త కోసం శుభవార్తనిచ్చారు. ఇంకా ఇంటి వ్యవహారాలలో ఆమెకు భర్తతో సమానమైన స్థానాన్ని కల్పించారు. ఆమె సలహాలకు కూడా

**మిగతా 23వ పేజీలో...**

# వెలుతురు సూర్యుడు మహాప్రవక్త ముహమ్మద్(స)

వ్యాసకర్త : కవి కరీముల్లా

**నేటికి** పదిహేను వందల సంవత్సరాల క్రితం అరేబియా ప్రాంతం హింసకు, దౌర్జన్యాలకు, వ్యసనాలకు, మూఢాచారాలు, మూఢనమ్మకాలకు ఆలవాలమై ఉండేది. ఎటుచూసినా అరేబియా ధనిక భూస్వాముల పీడన, అణచివేతల బారిన పడ్డ పీడిత జనం హాహాకారాలే విన్పించేవి. నల్లజాతికి చెందిన ప్రజల్ని బానిసలుగా చేసుకున్న అరబ్బు అసమసమాజం స్త్రీలను పశువుల కన్నా హీనంగా చూసేది. సరిగ్గా అదే కాలంలో యావత్ ప్రపంచం ఇలాంటి అవలక్షణాలతో అంధకారంలో ఉండేది. ఇలాంటి సమయంలో అరేబియాలోని మక్కాలో వీటిని నిరసిస్తూ ఓ విప్లవ స్వరం విన్పించింది. ఆ స్వరమే ఇస్లాం ప్రవక్త ముహమ్మద్(స).

ఆయన తన ప్రగతిశీల భావాలతో యావత్ సమాజాన్ని మేల్కొలిపారు. నాటి సమాజంలోని పేదలు, దళితులు, పీడితులు ఆయన్ని అనుసరించారు. పుట్టుకరీత్యా మనుషుల్లో అధికులు, అల్పులు లేరు. తెల్లజాతి వారికి నల్లజాతి వారిపై, నల్లజాతి వారికి తెల్లజాతి వారిపై, అరబ్బులకు అరబ్బేతరులపై, అరబ్బేతరులకు అరబ్బులపై కాని ఎలాంటి ఆధిక్యత లేదు. అల్లాహ్ దృష్టిలో మానవులంతా సమానులే. నేను మొత్తం మానవజాతికి సన్మార్గం చూపేందుకు, హితోపదేశం గరిపేందుకు వచ్చిన అంతిమ దైవప్రవక్తను. మనిషి తలవంచాల్సింది ఆ సృష్టికర్తకే తప్ప సృష్టితాలకో, ధనికులకో, పెత్తందార్లకో కాదు అంటూ ఏకేశ్వరత్వానికి, సామాజిక సమానత్వంకై ప్రవక్త ముహమ్మద్(స) ఇచ్చిన పిలుపు అరబ్బు ధనిక సర్దార్లకు ఆగ్రహం తెప్పించింది. అప్పటినుండి ఆయనపై భౌతిక, మానసిక దాడులు మొదలయ్యాయి. ఆయన వేటికీ వెరవలేదు. ఒక్కోసారి బహుదైవారాధకులు విసిరిన రాళ్ల దెబ్బలతో శరీరం రక్తసిక్తమయ్యేది. ఒంటె పేగులు తెచ్చి ఆయన మెడలో వేసి లాగేవారు. కానీ ఆయన ఎవ్వరినీ శపించేవారు కాదు. చివరికి ఆయన వారిపై చూపిన ప్రేమ ముందు కఠినాతికఠినమైన అరబ్బు సమాజం తలవంచక తప్పలేదు. క్రమంగా మొత్తం అరేబియా సమాజం ఆయన అనుసరణీయ సమాజమైంది.

అప్పటినుండి ఇస్లాం ప్రవక్త సాధించిన సామాజిక సమానత్వం మొత్తం ప్రపంచాన్ని నివ్వెరపర్చింది. అప్పటివరకూ బానిసలుగా పరిగణించబడ్డ నీగ్రోజాతి ప్రజలు అరబ్బులకు సమానమయ్యారు. అత్యంత పవిత్రమైన కాబా మస్జిద్ పైకప్పుపై నల్లజాతికి చెందిన బిలాల్(ర)ను ఎక్కి తొలి అజాన్ ఇవ్వమని ప్రవక్త ఆదేశించారు. హజ్రత్ బిలాల్ (ర) కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. ఎంతో ఉద్వేగంతో ఆయన అజాన్ ఇస్తుంటే అగ్రవర్ణ భావజాలం కల అరబ్బులలో కలకలం రేగింది. అప్పుడు ప్రవక్త వారిని ఉద్దేశించి 'మనం అల్లాహ్ కు కృతజ్ఞతలు తెల్పుకోవాలి. ఆయన మిమ్మల్ని అజ్ఞాన కాలపు చెడుల నుండి, అహంకారాల నుండి రక్షించాడు' అని పలకగా అరబ్బుల హృదయాలు పశ్చాత్తాపంతో కరిగిపోయాయి క్షమాపణ కోరాయి. అప్పటినుండి అరబ్బులు నీగ్రో ప్రజల ముందు నిలబడి 'ఓ నా ప్రియమైన సోదరా!' అంటూ గౌరవించేవారు. అంతేకాక తమ కుమార్తెలను నీగ్రోలకు ఇచ్చి వివాహాలు చేసేవారు. కనుకే ప్రఖ్యాత యూరోపియన్ చరిత్రకారుడు లామర్టైన్ తన 'హిస్టరీ డిలా టర్క్'లో ప్రవక్త ముహమ్మద్(స)ను ఇలా ప్రస్తుతించాడు: ''ప్రపంచంలో ప్రతిభావంతులైన వారు ఆయుధాలు సృష్టించారు. చట్టాలు చేసారు. రాజ్యాలు స్థాపించారు. అవన్నీ భౌతిక శక్తి యుక్తు లకు సంబంధించినటువంటివి కనుకనే అవన్నీ అనతికాలంలోనే కూలిపోయాయి. కాని ఇస్లాం ప్రవక్త ముహమ్మద్(స) తన నైతిక శక్తితో మహాసైన్యాల పునాదులు కదిలించడమే గాక లక్షలాది మనుషుల్ని చలింపజేశాడు. అన్నిటికంటే ముఖ్యంగా బలిపీఠాల్ని, దేవతలను, మతాలను, భావాలను, నమ్మకాలను, ఆత్మలను స్థానభ్రంశం చేశాడు''.

మొత్తం పరిస్థితులు మారిపోయి యావత్ అరేబియా సమాజం

ఆయన జీవించి ఉన్న కాలంలోనే ఆయన వెనుక నడుస్తున్నా అంతిమ ప్రవక్త ముహమ్మద్(స) నిరాడంబరత, స్వచ్ఛత మారలేదు. పగలంతా పరిశ్రమించి మెత్తటి పరుపులపై గాక ఖర్జూరపు చాపపై పడుకునేవారు. స్త్రీలు మన తల్లులు, చెల్లెల్లు, కూతుర్లు అంటూ స్త్రీల హక్కుల గురించి మాట్లాడేవారు. ధర్మం ప్రకారం పురుషులకు కల అన్ని హక్కులు స్త్రీలకూ ఉన్నాయని చెప్పి అరబ్బు పురుష సమాజాన్ని సంస్కరించారు. ప్రతి పురుషుడు తన గృహంలో ప్రవేశించే ముందు తన భార్యకు సలాం చేసి మరీ వెళ్లాలని చెప్పి పురుషాహంకారాన్ని తుత్తునియలు చేశారు. బాల్యంలోనే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ అనాథ బాలునిగా మొదలైన ఆయన జీవితం ప్రవక్తగా మక్కా నుండి బహిష్కరించ బడి ఓ వలసవాసిగా సాగి మానవ జీవన మూలాలకు సంబంధిం చిన అత్యున్నత సత్యాలను కనుగొన్నది. తన జీవిత పర్యంతం దుర్మార్గుల హింసకు గురౌతూ కూడా శాంతి, ప్రేమ, కరుణలతో తన జీవితకాలంలోనే తన చుట్టూ ఉన్న సమాజాన్ని మార్చిన ధీరోదాత్త ప్రవక్త ముహమ్మద్(స). ఆయన సత్యసంధతను, కరుణను ప్రత్యక్షంగా పొందిన ఆయన అనుచరులు తమపై అరబ్బు సర్దార్ల నుండి ఎన్ని విపత్తులు వచ్చినా, చివరికి ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారే తప్ప ప్రవక్తను వీడలేదు. అరేబియా సర్దార్లు ఖబ్బాబ్ బిన్ అర్త్ అనే ప్రవక్త సహచరుడ్ని కణకణలాడే నిప్పు కణాలపై నిలబెట్టి ఆయన శరీరం లోని కండరాలను క్రూరంగా కోస్తూ ఇప్పుడు నీకేమనిపిస్తుంది? నీ స్థానంలో ముహమ్మద్(స) ఉండి నీకు నీ పిల్లాజెల్లలతో సుఖంగా ఉండాలని లేదా? అంటూ అవహేళన చేస్తుంటే అతను -నేనే కాదు యావత్ నా కుటుంబాన్ని ముహమ్మద్(స) చూపిన మార్గంలో ధారపోసేందుకు సిద్ధమే తప్ప తన ప్రవక్తకు చిన్న ముల్లు గుచ్చుకున్నా సహించలేనని బదులిస్తారు. అందుకే ప్రసిద్ధ భారతీయ రచయిత దివాన్ చంద్ శర్మ తన "ప్రాఫెట్స్ ఆఫ్ ది ఈస్ట్"లో "ముహమ్మద్ దయాస్వరూపుడు. ఆయన ప్రభావాన్ని ఆయన చుట్టూ ఉండేవారు గ్రహించారు. మరెప్పుడూ దాన్ని మరువలేకపోయారు" అంటాడు. ప్రపంచానికి మానవీయ, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, నైతిక విలువలను బోధించిన అంతిమ దైవప్రవక్త తుదిశ్వాస విడిచే సమయంలో ఆయన ఒంటిపై ఉన్న బట్టలకు ఎన్నో అతుకులు. ఇంట్లో దీపం వెలిగించేందుకు నూనె లేని పరిస్థితి. కానీ ఆయన వెలిగించిన జ్ఞానజ్యోతి భూమి మూలమూలల్లోకీ ప్రసరించడం మానవజాతి చరిత్రలోనే ఓ మహాద్భుతం. ❖

21వ పేజీ తరువాయి...

విలువనివ్వాలని తెలియజేశారు. ఈ విధంగా ఆమెకు ఆమె గృహ సామ్రాజ్యానికి రాణిలా గౌరవాన్ని ప్రసాదించాలని బోధించారు.

**ఐదోది** : వివాహం విషయంలో, తలాఖ్, ఖులా లాంటి విషయా లలో కూడా స్త్రీ గౌరవాన్ని, ఆమె రక్షణను, ఆమె ప్రశాంతతను, ఆమె ఇష్టాన్ని గౌరవించటం జరిగిందని తెలియజేశారు. ఇంకా ఆయన(స) స్త్రీ ఇష్టం లేకుండా వివాహం చెయ్యకూడదని బోధించారు. ఆమె ఇష్టప్రకారమే ఆమె ఇష్టాన్ని తెలుసుకుని, ఆమె అంగీకారంతోనే వివాహం చెయ్యాలని, ఇంకా ఆమెతో ఎలాంటి కట్నకానుకలను తీసుకోకూడదని కూడా తెలియజేశారు. పైగా ఆమెకు భర్తయే మహర్ కానుకను ఇవ్వాలని బోధించారు. ఈ విధంగా ఆడపిల్ల వివాహాన్ని ఎంతో సులభతరం చేశారు.

ఆ తరువాత భర్త హింసించేవాడైతే ఆమె అతని నుంచి ఖులా తీసుకుని వేరైపోగలదనే హక్కును ప్రసాదించారు. భర్త చనిపోతే జీవితాంతం విధవగానే ఉండిపోయే అవసరం లేదని తెలియజేశారు. విడాకులు పొందిన స్త్రీని, భర్త చనిపోయిన స్త్రీని మళ్ళీ వివాహం చెయ్యటాన్ని ప్రోత్సహించారు.

**ఆరోది** : స్త్రీ పవిత్రతను కాపాడటానికి ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్ళినప్పుడు పరదాను పాటించాలని బోధించారు. ఆమె మానాన్ని సురక్షితంగా, పవిత్రంగా ఉంచటానికి పురుషులు కూడా తమ దృష్టిని క్రిందికి వాల్చి ఉంచమని బోధించారు. మొదటి దృష్టి మీది. రెండో దృష్టి షైతానుది. కనుక ఆమెపై రెండో దృష్టి పడకుండా కాపాడుకోమనీ పురుషులను హెచ్చరించారు. ఈ విధంగా అక్రమ సంబంధాలకు, అత్యాచారాలకు, వ్యభిచారాలకు తెరువబడే మొదటి ద్వారాన్నే మూసివేశారు.

**ఏడోది** : స్త్రీ పురుషులిద్దరూ విధిగా విద్యనభ్యసించాలని బోధించారు. ఇందులో ఇద్దరి మధ్య ఎలాంటి వ్యత్యాసమూ చూపలేదు. ఒక విధంగా చూస్తే పురుషుని కంటే అధికంగా స్త్రీ విద్యనే ప్రోత్సహించారు. ఎందుకంటే ఆమె ఒడి నుంచే ఒక సత్సమాజం ఉనికిలోకి వస్తుందని. ఇంకా ఆమె తన పరిధిలో ఉండి ఉద్యోగాలు చేసుకునే, సంపాదించుకునే అనుమతిని కూడా ఆయన(స) ప్రసాదించారు. స్త్రీ గురించి ఇలాంటి ఎన్నో విషయాలను బోధించారు. తరువాత కూడా ఎవరైనా ఇస్లామ్‌లో, అల్లాహ్ ఆజ్ఞలలో, దైవప్రవక్త బోధనలలో స్త్రీకు స్వాతంత్ర్యం లేదని చెప్పినట్లయితే అది మూర్ఖత్వం కాదా!?



# జనాభా పెరుగుదల వరమా- శాపమా?

- ముహమ్మద్ షరీఫ్

**జనాభా పెరుగుదలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేయడంతో ఈ విషయం మరోమారు చర్చనీయాంశమైంది.**

'జనాభా పెరగాలి, అందరూ పిల్లల్ని కనడానికి సంకోచించకండి' అనేది ఆయన వ్యాఖ్యల సారాంశం. ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది తొలిసారికాదు. ఐతే ఈయనకేమైనా మతిపోయిందా? ఒకవైపు మాల్థస్ థియరీని నరనరాల్లో జీర్ణించుకున్న ప్రజలు దీనిని గురించి ఇలానే ఆలోచిస్తారు. మాల్థస్ థియరీ ప్రకారం జనాభా పెరిగే కొద్దీ వనరులు తరిగిపోతాయి. ఎందుకంటే వనరులు సంకలనంలో పెరుగుతాయి కానీ జనాభా గుణకారంలో పెరుగుతుంటుంది. కనుక జనాభాను నియంత్రించకపోతే మానవ మనుగడ దుర్లభమైపోతుంది అని ఈ సిద్ధాంతం అంతరార్థం.

ఏ మాత్రం ఇంగితమున్న వ్యక్తైనా దీనిని నిజమని అంటాడు. మరి ఎకనమిస్ట్‌గా, వరల్డ్ బ్యాంక్ సియిఓ స్థాయి వ్యక్తిగా విమర్శకులచే పిలవబడే చంద్రబాబు నాయుడు ఎందుకు ఇలా విచిత్ర వ్యాఖ్యలు చేస్తున్నారనేది ఆలోచించాలి. చంద్రబాబునాయుడి ఈ వైఖరికి కారణం చైనా ఎదుర్కొంటున్న సమస్యలు కావచ్చు.

చైనా నేడు ఏజింగ్ సమస్యతో బాధపడుతుంది. ఒకప్పుడు చైనాలో ఉత్పాదకత తగ్గిన కారణంగా వృద్ధుల సంఖ్య పెరిగింది. ఫలితంగా శ్రామికశక్తి తగ్గిపోయింది. కనుక ఉన్న టెక్నాలజీని వినియోగించుకునేందుకు సరిపడా మేన్ పవర్ లేదు. కనుక చైనా ఆర్థికాభివృద్ధిని కూడా ఇది దెబ్బతీసింది. ఉన్న ఓల్డేజ్ పాపులేషన్ శ్రమ పడలేదు. దేశపు ఎకానమీకి ఏ విధంగానూ తోడ్పడదు. తద్వారా దేశ జిడిపి తగ్గుముఖం పడుతుంది. సరిగ్గా ఇదే సమస్యలతో చైనా నేడు బాధపడుతుంది. వృద్ధులు పిల్లల మధ్య అంతరం ఎక్కువున్న కారణంగా వృద్ధ బంధువులను చూసుకోవలసిన బాధ్యత యువతపై పడడం, వారు నిర్వర్తించే అవకాశం లేనంతగా ఆడ, మగ తేడా లేకుండా పని ఒత్తిడిలో ఉండిపోవడం వలన చైనా కుటుంబ వ్యవస్థ నెర్రలు చాచి, కూలిపోడానికి సిద్ధంగా ఉంది. ఇక ఇది అనేక సామాజిక, ఆర్థిక భారాలకు కారకమైంది.

ఇక శ్రామిక, శక్తి, ఉత్పాదకత తగ్గిన దేశానికి ట్యాక్స్ కట్టేవారి సంఖ్య కూడా తగ్గుతుంది. కనుక ఇది కూడా ప్రతికూల ప్రభావమే. పారిశ్రామికీకరణ, టెక్నాలజీ ప్రభావంతో నగరీకరణ జరిగింది. చైనాలో గ్రామీణ జనాభా తగ్గింది. పట్టణాల దిశగా వలసల విస్ఫోటనం జరిగింది. తద్వారా

గ్రామీణ ప్రాంతాల్లో శ్రమశక్తి కొరవడింది. వ్యవవసాయోత్పత్తి నేలచూపులు చూస్తుంది. గ్రామీణ జనాభా తగ్గడం వలన సహజంగానే గ్రామీణాభివృద్ధి కుంటుపడింది.

జనాభా పెరగడం వలన పెద్ద సంఖ్యలో చెల్లించాల్సిన పెన్షన్, సామాజిక భద్రతా విషయాలు ఆర్థిక వ్యవస్థపై పెనుభారమయ్యాయి. కార్మిక శక్తి లేకపోవడం, ఉత్పాదకత సన్నగిల్లడం కూడా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్నే వేశాయి చైనాలో. తగ్గుతున్న జనాభా కారణంగా నిర్మితమైన గృహాలు, సముదాయాలు వృథాగా పడిఉంటున్నాయి, పర్యవసానంగా హౌసింగ్ రంగం కుదేలైపోయింది. ప్రాంతీయ అసమానతలకు కూడా ఇది దారి తీస్తుంది. అక్కడ కొన్ని ప్రాంతాలు తీవ్రమైన జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. తరుగుతున్న జనాభా కారణంగా విద్య, ఆరోగ్య రంగాల్లో డిమాండ్‌ని తగ్గిస్తాయి. తద్వారా వాటిపై ఇన్వెస్ట్‌మెంట్ తగ్గుతుంది. తద్వారా ఆయా రంగాలు కుంటుపడ్డాయి. ప్రజారోగ్యం కుంటుపడింది. జనాభా తగ్గుదల అనేది వినియోగదారుల వ్యయాన్ని తగ్గిస్తుంది. అది అర్థ వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం వేస్తుంది. డిమాండ్ తగ్గడం ద్వారా సప్లై తగ్గుతుంది. సహజంగానే ఉత్పత్తి కూడా తగ్గుతుంది. తరుగుతున్న జనాభా సామాజిక నిర్మాణాలలో మార్పులు తీసుకు వస్తుంది.

కమ్యూనిటీ డైనమిక్స్‌ను కూడా మారుస్తుంది. దానివలన విలువలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. సంబంధాలు విచ్ఛిన్నమౌతాయి. మొత్తంగా మానవ జీవన వ్యవస్థ అతలాకుతలమవుతుంది. పై విపరిణామాలను అనుభవించిన చైనా నేడు కొన్ని నివారణ చర్యలు చేపట్టింది. వాటిని చూస్తే జనాభా నియంత్రణా సిద్ధాంతాలు మానవ జీవన వ్యవస్థను నిర్మూలిస్తాయని చెప్పవచ్చు. చైనా చేపట్టిన నష్ట నివారణా చర్యలలో కొన్ని ఇలా ఉన్నాయి.

మొదటగా ఒన్ చైల్డ్ విధానాన్ని సడలించి త్రి చైల్డ్ పాలసీని ప్రవేశపెట్టడం ద్వారా జనాభా నియంత్రణకు వ్యతిరేక దిశలో పయనిస్తుంది.

ఎక్కువ మంది పిల్లలను కలిగిన వారికి ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించడం ద్వారా పిల్లలను అధికంగా కనేలా కుటుంబాలను ప్రోత్సహిస్తుంది.

ఉన్న శ్రామిక శక్తి సరిపోవడం లేదు కనుక ఇమ్మిగ్రేషన్ విధానాలను సరళీకరించడం ద్వారా శ్రమశక్తిని ఆకర్షిస్తుంది. పెన్షన్ సంస్కరణలు, వృద్ధుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. యువతను ఆకర్షించ డానికి గ్రామీణాభివృద్ధిలో పెట్టుబడులను పెంచుతుంది. ఈ చర్చ నేపథ్యంలో అధిక జనాభా దేశానికి గుదిబండ కాదని కల్పతరువని చైనా అర్థం చేసుకున్నట్లుగా మన దేశ పాలకులు సైతం గుర్తించాలని ఆశిద్దాం. భయానక సమస్యల నుండి దేశాన్ని రక్షించుకుందాం. ❖


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# మహనీయ ముహమ్మద్(స) వారి ప్రత్యేకతలు

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**ఆయనొక యోధుడు, ధర్మ బోధకుడు. ఆయనొక శాంతి పుంజం, చైతన్య దీపం, మండే సూర్యం, చల్లని చంద్రం. ఆయనొక ధర్మ తేజం, క్రాంతి రూపం. ఆయనొక నిర్మల జ్యోతి, వినిర్మల ఆత్మ– ఆయనే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స).**

ప్రవక్తల్లో అగ్రజులు ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స). నేల మీద నడిచిన ఆదర్శాల్లో ఉత్తమ ఆదర్శం ప్రవక్తది. ఉత్తమ ఆదర్శాల్లో అగ్ర పీఠం ప్రియ ప్రవక్త (స) వారి ఆదర్శానిదే. ఉత్తమ నీతికి నెలవు, అత్యున్నత నైతికతకు ప్రమాణం ఆయన జీవితం. "(ఓ ప్రవక్తా!) నువ్వు ఉన్నత నైతిక శిఖరాగ్ర భాగాన్ని అధిరోహించి ఉన్నావు". (ఖలమ్: 4) నిత్య నూతనం అయిన ఆయన జీవితం సమస్త మానవాళికి అంతిమ ఆదర్శం. ఖుర్ఆన్ ఇలా అంటోంది: "మీ కోసం అల్లాహ్ ప్రవక్తలో అత్యుత్తమ, అత్యున్నత ఆదర్శం ఉంది". (అహ్జాబ్: 21) అలాంటి సాత్వికుడు, సత్య ప్రవక్త సంపూర్ణుడు, జగద్గురువు విశిష్ఠ స్థానాన్ని తెలియజేసే చిరు ప్రయత్నమే ఈ వ్యాసం. ప్రవక్తల మధ్య ఆయనకున్న గౌరవాదరణల రీత్యా అల్లాహ్ ఆయన్ను అనేక ప్రత్యేకతలను కల్పించాడు. వివరాల్లోకి వెళితే...

**మొదటి ప్రత్యేకత:**

అల్లాహ్ ఆయన్ను 'యా అయ్యుహన్నబియ్యు!' (అన్ఫాల్:64) 'ఓ ప్రవక్తా!' అన్న గుణవాచకంతో ఖుర్ఆన్‌లో పదమూడు స్థానాలలో ప్రస్తావించాడు. "యా అయ్యుహర్రసూల్!" (మాయిద-4) 'ఓ సందేశహరుడా!' అన్న గుణవాచకంతో రెండు చోట్ల ప్రస్తావించాడు. అలా ప్రస్తావించిన ప్రతిసారి ఆయన స్థాయి, గౌరవాన్ని సంపూర్ణ పద్ధతిలో ప్రస్తావించడం కొసమెరుపు. అలా అల్లాహ్ ఖుర్ఆన్‌లో మరే పవక్త గురించి ప్రస్తావించలేదు. అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఏ ప్రవక్తను సంబోధించినా- 'ఓ ఆదమ్' (బఖరహ్: 35) 'ఓ ఈసా' (మాయిదహ్ : 116), 'ఓ మూసా' (ఆరాఫ్: 144), 'ఓ ఇబ్రాహీమ్' (సాఫ్ఫాత్: 104) అని వారి నామంతోనే సంబోధించాడు.

ఇక ఎక్కడయితే ప్రవక్త(స) వారి నామ ప్రస్తావన వచ్చిందో అక్కడ సమాచారాన్ని అందజేయడం, యథార్థాన్ని విశదపర్చడం ఉద్దేశ్యంగా ఉంటుంది. (ప్రజలారా!) ముహమ్మద్ (స) మీ పురుషుల్లో ఎవరికీ తండ్రి కాడు. ఆయన అల్లాహ్ సందేశహరుడు. దౌత్య పరంపరను పరిసమాప్తం చేసిన అంతిమ దైవప్రవక్త. అల్లాహ్ సమస్త విషయాలు ఎరిగినవాడు. (అహ్జాబ్: 40)

''ముహమ్మద్'' అన్న నామ ప్రస్తావన ఖుర్ఆన్‌లో నాలుగు సందర్భాలో వచ్చింది.

## రెండవ ప్రత్యేకత:

పూర్వ ప్రవక్తల అనుచర సమాజం వారిని వారి పేరుతో పిలిచేవారు. 'వారన్నారు- ఓ మూసా!' (ఆరాఫ్:138), 'హవారీలు ఇలా అన్నారు- 'మర్యం కుమారుడగు ఓ ఈసా!' (మాయిదహ్: 112), 'వారన్నారు- ఓ హూద్!' (హూద్: 53). కానీ ప్రవక్త(స) వారిని అలా పిలవ కూడదు అని అల్లాహ్ ఆదేశించాడు: ''ముస్లింలారా! దైవప్రవక్త పిలుపును మీరు ఒకర్నొకర్ని పిలుచుకునే పిలుపుగా భావించ కండి.'' (నూర్: 63)

## మూడవ ప్రత్యేకత:

అల్లాహ్ ఆయన జీవితాన్ని ప్రమాణంగా పేర్కొన్నాడు: ''నీ ఆయుష్షు సాక్షిగా! వారు తమ (ముదనష్టపు) కైపులో గుడ్డివారయి పోయారు''. (హిజ్ర్: 72) స్వయంగా అల్లాహ్‌యే ఆయన జీవితం మీద ప్రమాణం చెయ్యడం అంటే ఆయన జీవితం ఎంత పవిత్రమయినదో, ఎంత మహిమాన్వితమయినదో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రత్యేకత ఆయనకు తప్ప ఇతరులకు దక్కలేదు.

## నాల్గవ ప్రత్యేకత:

అల్లాహ్ ఖుర్ఆన్‌లో అనేక మంది ప్రవక్తలను ఒకే చోట ప్రస్తావించిన అధిక సందర్భాలలో ప్రవక్త (స) వారిని ముందుగా పేర్కొన్నాడు. ''(ముహమ్మద్!) మేము నూహ్‌కు, అతని తర్వాత వచ్చిన ప్రవక్తలకు ఎలా దివ్య జ్ఞానం అందజేశామో అలా నీకూ అందజేస్తున్నాం. మేము ఇబ్రాహీం, ఇస్మాయిల్, ఇస్‌హాఖ్, యాఖూబ్, యాఖూబ్ సంతానం, ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్, సులైమాన్ (అలై)లకు దివ్యజ్ఞానం అందజేశాం. దావూద్ (అలై)కు జబూర్ ప్రసాదించాం. నీకు పూర్వం వచ్చిన ప్రవక్తలలో కొందరి వృత్తాంతాలు నీకు తెలిపాము. అనేక మంది వృత్తాంతాలు తెలపలేదు. మేము మూసాతో (నేరుగా) సంభాషించాం. (అన్‌నిసా: 163-164)

''ప్రవక్తా! మేము యావత్ ప్రవక్తలచేత చేయించిన ప్రమాణం జ్ఞప్తికి తెచ్చుకో. మేము నీచేత కూడా ప్రమాణం చేయించాం. నూహ్, ఇబ్రాహీం, మూసా, మర్యం కుమారుడు ఈసా (అలై)ల చేత కూడా ప్రమాణం చేయించాం.'' (అహ్జాబ్: 7)

## అయిదవ ప్రత్యేకత:

ఇస్రా, మేరాజ్ సందర్భంగా బైతుల్ మఖ్దిస్‌లో ప్రవక్తలందరికి నమాజులో నాయకత్వం వహించడం. ఆ సందర్భంగా ఆయన ఒక లక్ష 24 వేల మంది ప్రవక్తలకు నాయకత్వం వహించి నమాజు చేయించారు. (ముస్లిం హదీసు గ్రంథం)

## ఆరవ ప్రత్యేకత:

ప్రవక్తలందరి చేత ఆయన కోసం మాట- ప్రమాణం తీసుకోవడం జరిగింది. ''అల్లాహ్ తన ప్రవక్తల నుండి తీసుకున్న ఈ వాగ్దానం గురించి ఆలోచించండి. ఆయన ఇలా అన్నాడు: ''నేను మీకు గ్రంథాన్ని, వివేకాన్ని ప్రసాదిస్తున్నాను. ఆ తరువాత మీకివ్వబడిన గ్రంథాన్ని ధృవీకరిస్తూ మరో ప్రవక్త వస్తే అతడ్ని మీరు విశ్వసించి అతనికి సహాయం చేయాలి.'' ఇలా అన్న తర్వాత ''దీన్ని మీరు అంగీకరిస్తున్నారా? నేను మీపై మోపిన ఈ ప్రమాణ బాధ్యతను మీరు స్వీకరిస్తున్నారా?'' అనడిగాడు దేవుడు. దానికి దైవప్రవక్తలు ''ఆ..మేము అంగీకరిస్తున్నాం, స్వీకరిస్తున్నాం'' అన్నారు. అప్పుడు దేవుడిలా అన్నాడు: ''దీనికి మీరు సాక్షులుగా ఉండండి. మీతో పాటు నేనూ సాక్షిగా ఉంటాను. ఇకపై ఎవరు తమ వాగ్దానాన్ని భంగపరుస్తారో వారే నీతిలేని దుర్మార్గులు'' (ఆలి ఇమ్రాన్: 81, 82)

## ఏడవ ప్రత్యేకత:

సుదూర ప్రాంతంలో ఉన్నా సరే శత్రువు గుండెల్లో దడ. ''ఒక నెల ప్రయాణం చేసేంతటి దూరపు భయ తేజస్సుతో నాకు తోడ్పాటునందించడం జరిగింది''. (బుఖారీ)

## ఎనిమిదవ ప్రత్యేకత:

ఆయన సముదాయం సముదాయాల్లోకెల్లా ఉత్తమ సముదాయం. ''విశ్వాసులారా! ఇక నుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్కరించడానికి రంగంలోకి తీసుకు రాబడిన శ్రేష్ఠ సమాజం మీరే. మీరు మంచి పనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. చెడుల నుండి వారిస్తారు. దేవుడ్ని ప్రగాఢంగా విశ్వసిస్తారు. గ్రంథప్రజలు (కూడా) విశ్వసించి ఉంటే వారికెంతో మేలు జరిగేది. వారిలో విశ్వసించినవారు కూడా కొందరున్నారు. కాని చాలామంది అవిధేయులే ఉన్నారు''. (ఆలి ఇమ్రాన్: 110) ''మీరు 70 సముదాయాల్లో చిట్ట చివరి సముదాయం. వాటన్నింటిలో ఉత్తమ సముదాయం. అల్లాహ్‌కు ఎంతో ఇష్టమైన సముదాయం'' అన్నారు ప్రవక్త (స). (తిర్మిజీ)

## తొమ్మిదవ ప్రత్యేకత:

ప్లేగు వ్యాధి, దజ్జాల్ ఆయన పట్టణమైన మదీనాలో ప్రవేశించ లేరు. ''మదీనా తలుపుల దగ్గర దైవ దూత పహారా కాస్తూ

ఉంటారు. అందులో ప్లేగు వ్యాధి గానీ, దజ్జాల్ గాని ప్రవేశించ జాలరు'' అన్నారు ప్రవక్త (స). (బుఖారీ, ముస్లిం)

## పదవ ప్రత్యేకత:

ఆయన్ను మనిషి తన ధన, మాన, ప్రాణాలకన్నా అధికంగా అభిమానించాలి, గౌరవించాలి.

''ప్రవక్తా! వారికి చెప్పు: ''మీ తండ్రులు, కొడుకులు, సోదరులు, భార్యలు, బంధుమిత్రులే గాక మీరు కూడబెట్టుకున్న ఆస్తులు, (సత్యాన్ని విశ్వసిస్తే) మందగించి పోతాయేమోనని మీరు భయపడుతున్న మీ వ్యాపారాలు, మీకు ప్రీతికరమైన మీ ఇండ్లు- ఇవన్నీ మీకు అల్లాహ్ కంటే, ఆయన ప్రవక్త కంటే, ఆయన మార్గంలో జరిపే పోరాటం కంటే ఎక్కువ ప్రియమైనవయితే మీ గురించి అల్లాహ్ నిర్ణయం వచ్చేదాకా ఎదురుచూడండి. దుర్జను లకు అల్లాహ్ ఎన్నటికీ సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదించడు.'' (తౌబహ్: 24)

## పదకొండు, పన్నెండు, పదమూడవ పద్నాల్గవ ప్రత్యేకత:

నాయకత్వం, పునరుత్థానం, ప్రశంసా పతాకం, స్వర్గ ప్రవేశం. ''ప్రళయ దినాన ఆదం సంతతిలో నేను అధినాయకుడను- ఇది గర్వంతో చెబుతున్న మాట కాదు. నా చేతిలో ప్రశంసా పతాకం ఉంటుంది- ఇది గర్వంతో చెబుతున్న మాట కాదు. ప్రవక్తల్లోని ఏ ప్రవక్త అయినా నా జెండా క్రిందనే ఉంటారు. పునరుత్థాన దినాన భూమి చీల్చుకుని లేపబడే తొలి వ్యక్తి నేనే- ఇది గర్వంతో చెబుతున్న మాట కాదు' అన్నారు ప్రవక్త (స). (తిర్మిజీ) వేరొక ఉల్లేఖనంలో- ''ప్రళయ దినాన స్వర్గంలో ప్రవేశించే తొలి వ్యక్తిని నేనే- ఇది గర్వంతో చెబుతున్న మాట కాదు''అని ఉంది. (దారమీ)

## పదిహేనవ ప్రత్యేకత:

మఖామె మహ్మూద్- ప్రశంసా భరిత పీఠ అధిరోహణ. ''నీ ప్రభువు నిన్ను త్వరలోనే అత్యున్నతమైన స్తుతి స్థానం మీద అధిష్ఠింప జేయవచ్చు.'' (ఇస్రా: 79) అదే సిఫారసు చేసే స్థాయి. అది ఒక్క ప్రవక్త(స) వారికి తప్ప ఇంకెవ్వరికీ దక్కదు. ప్రవక్తలందరూ చేతులెత్తేయగా- అంతిమంగా అందరూ అంతిమ దైవప్రవక్త (స) వారి వద్దకు వచ్చి సిఫారసు చేయాల్సిందిగా కోరతారు. అదే మఖామె మహ్మూద్- ప్రశంసా భరిత పీఠం- స్తుతి స్థానం' అన్నారు ప్రవక్త (స). (బుఖారీ)

## పదహారవ ప్రత్యేకత:

ప్రవక్తలందరి అనుయాయులకన్నా, ఆయన అనుయాయులు అధికంగా ఉంటారు. ''స్వర్గ వాసుల పంక్తులు 120 అయి ఉంటాయి. అందులో 80 పంక్తులు ఈ సముదాయానికి చెందినవి, 40 పంక్తులు మిగతా సముదాలన్నింటికి చెందినవయి ఉంటాయి'' అన్నారు ప్రవక్త (స). (ఇబ్ను మాజహ్)

## పదహేడవ ప్రత్యేకత:

విశ్వ మానవాళి వైపునకు పంపబడిన జగత్ప్రవక్త. పూర్వం ప్రతీ ప్రవక్త తన జాతి వైపునకు మాత్రమే పంపబడేవాడు. నన్ను ప్రతి ఎర్రవాని, నల్లవాని వైపునకు (సమస్త మానవాళి వైపునకు) ప్రవక్తగా చేసి పంపడం జరిగింది. (బుఖారీ)

ఓ ముహమ్మద్ (స)! మేము నిన్ను యావత్తు మానవాళి కోసం (స్వర్గ) శుభవార్త అందజేసేవానిగా, (దైవశిక్ష గురించి) హెచ్చరించే వానిగా చేసి పంపాము. కాని చాలా మందికి ఈ వాస్తవం తెలియదు. (సబా: 28)


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

### పద్దెనిమిది, పంతొమ్మిది, ఇరవైవ ప్రత్యేకత:

భూమి మొత్తం నా కోసం మస్జిద్‌గా చెయ్యబడింది. యుద్ధ ప్రాప్తి నా కోసం ధర్మసమ్మతం చెయ్యబడింది. నాకు పెద్ద సిఫారసు అనుగ్రహించబడింది. ప్రతి ప్రవక్త కేవలం తన జాతి జనం వైపునకు మాత్రమే వచ్చేవాడు. నేను ప్రపంచ ప్రజలందరి వైపునకు పంపబడ్డాను. (బుఖారీ)

### 21వ ప్రత్యేకత:

ఆయన గత పాపాలు, భవిష్య పొరపాట్లు మన్నించబడ్డాయి. ''(ముహమ్మద్ (స)! మేము నీకు స్పష్టమైన విజయం ప్రసాదించాం. అల్లాహ్ నీ గత పొరపాట్లు, భావి పొరపాట్లు మన్నించి నీపై తన అనుగ్రహం పరిపూర్తి చేయాలని, నీకు రుజుమార్గం చూపి, పెద్ద సహాయం చేయాలని (ఈ శుభవార్త నీకు విన్పిస్తున్నాడు)''. (ఫత్హ్: 1-3)

### 22వ ప్రత్యేకత:

హౌజె కౌసర్ సరోవరం ఆయనకు ఇవ్వబడింది. ''(ముహమ్మద్!) మేము నీకు కౌసర్ (సరోవరం) ప్రసాదించాము.'' (కౌసర్: 1) ''ప్రతి ప్రవక్తకు ఒక సరోవరం ఉంటుంది. ఎవరి సరోవరం మీద ఎక్కువ మంది ప్రజలు వస్తారని వారు పోటీ పడతారు. ఎక్కువ మంది వచ్చే సరోవరం నాదే అయి ఉంటుందన్న నమ్మకం నాకుంది'' అన్నారు ప్రవక్త (స). (తిర్మిజీ)

### 23వ ప్రత్యేకత:

శాశ్వత మహిమ ఖుర్‌ఆన్. సాధారణంగా ప్రవక్తకు ఇవ్వబడే మహిమ కాలానికనుగుణంగా, ప్రజా డిమాండ్ మీద ఆధార పడి ఇవ్వబడుతుంది. తత్కారణంగా తర్వాతి కాలంలో దాని ప్రభావం ఉండదు. అలాంటి వందలాది మహిమలు ప్రవక్త ముహమ్మద్ (స) వారికి సయితం ఇవ్వబడ్డాయి (వాటిని ప్రోది చేస్తే ఓ మహా గ్రంథమే అవుతుంది). అయితే ఒక్క మహిమ మాత్రం ప్రళయం వరకూ పని చేస్తూనే ఉంటుంది. అదే ఖుర్‌ఆన్ గ్రంథరాజం.

### 24వ ప్రత్యేకత:

అల్లాహ్ ఆయన్ను మేరాజ్ సందర్భంగా తన వద్దకు పిలిపించుకొని ఏ మధ్యవర్తి లేకుండా సంభాషించాడు. (ముస్లిం)

### 25వ ప్రత్యేకత:

స్వర్గంలో 'వసీలా' స్థానం ఆయనొక్కరికే లభిస్తుంది. ''మీరు నా కోసం అల్లాహ్‌తో వసీలహ్‌ను కోరుకోండి'' అన్నారు ప్రవక్త (స). అందుకు సహాబా- 'వసీలహ్ అనగానేమి?' అని ప్రశించారు. 'అది స్వర్గపు శిఖర భాగం. అది ఒకే ఒక్క వ్యక్తికి దక్కుతుంది. ఆ ఒక్క వ్యక్తి నేనే అయి ఉంటానన్న నమ్మకం నాకుంది' అన్నారు ప్రవక్త (స). (తిర్మిజీ)

### 26వ ప్రత్యేకత:

ఆయనకు ''గిరి అంతటి భావాన్ని గరిటెలో అందించే వాక్పటిమను అనుగ్రహించడం జరిగింది''. (ముస్లిం ) ఆయన మాటలు గరిటెడంత చిన్నగా ఉంటాయి కానీ, వాటి భావం గిరి (పర్వతం) అంతటి పెద్దదై ఉంటుంది.

### 27వ ప్రత్యేకత:

ఆయనపై దైవ ధర్మం ఇస్లాం సంపూర్ణం చేయబడింది. నేనీ రోజు మీ కోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవన వ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీ కోసం నా అనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. మీ శ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవనధర్మంగా ఆమోదించాను. (మాయిద: 3)

### 28వ ప్రత్యేకత:

ఆయన ద్వారా దైవ దౌత్య పరంపరను పరిసమాప్తం గావించడం జరిగింది. (ప్రజలారా!) ముహమ్మద్ (స) మీ పురుషుల్లో ఎవరికీ తండ్రి కాడు. ఆయన అల్లాహ్ సందేశహరుడు. దౌత్య పరంపరను అంతమొందించిన అంతిమ దైవప్రవక్త. అల్లాహ్ సమస్త విషయాలు ఎరిగినవాడు. (అహ్జాబ్ - 40)

### 29వ ప్రత్యేకత:

సమస్త లోకాల పాలిట ఆయన కారుణ్యం. ముహమ్మద్ (స)! మేము నిన్ను యావత్తు ప్రపంచవాసుల పాలిట (దైవ) కారుణ్యంగా చేసి పంపాము. (అంబియా - 107)

### 30వ ప్రత్యేకత:

ఖుర్‌ఆన్ ఆయన శరీరావయవాలను పేర్కొన్నంత గొప్పగా మరే ప్రవక్త శరీరావయవాల గురించి పేర్కొనలేదు. అతను తన మనోవాంఛలకు తలయొగ్గి మాట్లాడడు. కళ్ళు చూసిన దానిలో

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

హృదయం అసత్యాన్ని మిళితం చేయలేదు. అతని చూపులు వేరేవైపు మరలడంగాని, హద్దుమీరి ముందుకు పోవడంగాని జరగలేదు. (అన్ నజ్మ్: 3 - 17)

## చివరి మాట: ఆయన జీవితం మనకిచ్చే సందేశం.

వివేకానికి నిలువుటద్దం, కోటి కాంతుల మేలిమి కిరణం విశ్వ కారుణ్యమూర్తి ముహమ్మద్ (స). 'ఓర్పుతోనే విజయం సాధ్యం' (సహీహుల్ జామె) అన్న ప్రవక్త (స) వారి బాటలో నడిస్తే మనలో వ్యక్తిత్వం ప్రజ్వలిస్తుంది. 'ఓర్మి- సహనం, కూర్మి- ప్రేమ, శాంతి, క్షమ భావనను పెంచుకోవాలంటే ఆయన ప్రవచనాలు సదా సర్వత్రా ఆచరణీయం. కోపతాపాలకు తావీయకుండా, పగా ప్రతీకారాల జోలికి పోకుండా మానవత్వంతో ముందుకు సాగాలి మనం. మన పలుకు బంగారం అవ్వాలి, మన ఆభరణం దైవభీతి, సహనం అవ్వాలి.

'మీరు సంఘాన్ని అంటి పెట్టుకు ఉండండి. వర్గాలుగా చీలి పోకండి. నిశ్చయంగా షైతాన్ ఒంటరి వ్యక్తికి దగ్గరగా ఉంటాడు. ఇద్దరు వ్యక్తులకు దూరంగా ఉంటాడు. స్వర్గం నడి మధ్యలో ఓలలాడాలనుకునే వ్యక్తి సంఘ నీతికి కట్టుబడి ఉండాలి. (తిర్మిజీ) అని చెప్పిన ఆయన మాటలలోని ఆంతర్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఒంటరి పోరుకంటే సంఘటిత పోరుతోనే సత్ఫలితాలు సాధ్యం అని మనం ఎంత తొందరగా గ్రహిస్తే అంతే మంచిది.

'మీరు సత్యానికి కట్టుబడండి'. (ముత్తఫకున్అలైహి) అన్న ఆయన (స) పిలుపు స్ఫూర్తితో సత్యాన్ని శ్వాసించాలి, సత్య సహిత జీవితాన్ని ప్రేమించాలి. సత్య సహిత మరణాన్ని కౌగిలించుకోవాలి. సత్య నిత్య సస్య బాటలో ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమిస్తూ జీవన యానంలోని మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించాలి. 'ధర్మ స్థాపన కోసం ఎన్ని సార్లు మరణించి ఎన్ని సార్లు బతికించబడినా మళ్ళీ ధర్మం కోసం మరణించడాన్నే నేను ఇష్ట పడతాను'. (ఇబ్ను హిబ్బాన్) అన్న ఆయన శక్తివంతమైన మాట, ఆ అకుంఠిత దీక్ష మనందరికీ ఆదర్శం అవ్వాలి.

సమాజ, దేశ అభివృద్ధి అంటే, ప్రతి పౌరుని నైతికాభివృద్ధియే. ఏ దేశమయినా, మరే సమాజమయినా మన ప్రాధాన్యతను గుర్తించే నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలి. నాయక లక్షణాలను అలవర్చు కోవాలి. మనం సత్య బాటన నడవడంతోపాటు మన తోటి వారిని సయితం నడిపించే ప్రయత్నం చేయాలి.

'హితాన్ని కోరేదే ధర్మం' అన్నారు ప్రవక్త (స). ( ముస్లిం) సమాజ, సంఘ, దేశ, ప్రపంచ నాయకులు, ప్రజా సంపూర్ణ శ్రేయాన్ని మనసారా కోరుకునే, దాని కోసం శక్తి వంచన లేకుండా అవిరళంగా కష్టించే, అవిశ్రాంతంగా పరిశ్రమించే శ్రేష్ఠ గణంగా మనం ప్రపంచ వేదిక మీదకు రావాల్సిన సమయం ఆసన్నమయ్యింది.

విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించే సమయ మింకా రాలేదా? ఆయన పంపిన సత్యం ముందు లొంగిపోయే వేళ ఆసన్నం కాలేదా? గతంలో కొందరికి గ్రంథం ఇవ్వబడింది. కాని ఓ సుదీర్ఘకాలం గడచిన తర్వాత వారి హృదయాలు కఠినమై పోయాయి. ఈనాడు వారిలో చాలామంది దుర్మార్గులై ఉన్నారు. మీరలా కాకూడదు సుమా! వినండి! భూమి మృతప్రాయమైన తర్వాత అల్లాహ్ దానికి తిరిగి జీవం పోస్తున్నాడు. (అలాగే మృత ప్రాయమైన మానవతక్కూడా ప్రవక్తల ద్వారా జీవం పోస్తున్నాడు.) మీరు విషయం గ్రహిస్తారని మా సూక్తులు మీకు విడమరచి చెబుతున్నాం. (అల్ హదీద్: 16-17)

చిత్తశుద్ధితో దానధర్మాలు చేసే, దేవునికి శ్రేష్ఠమైన రుణం అందజేసే స్త్రీ పురుషులకు అల్లాహ్ తప్పక (వారి సత్కార్యాన్ని) అనేక రెట్లు పెంచి తిరిగిస్తాడు. ఆపై వారికి అత్యంత శ్రేష్ఠమైన ప్రతిఫలం కూడా లభిస్తుంది. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను మనస్ఫూర్తిగా విశ్వసించినవారే తమ ప్రభువు దృష్టిలో సత్యసంధులు, ధర్మసాక్షులు. వారి కోసం తగిన ప్రతిఫలం, జ్యోతి ఉన్నాయి. దీనికి భిన్నంగా అవిశ్వాస వైఖరి అవలంబించి, మా సూక్తులు నిరాకరించినవారు మాత్రం నరకానికి పోతారు.

(అల్ హదీద్: 18-19)

వినండి, ఇహలోక జీవితం ఒక ఆట, తమాషా, బాహ్య పటాటోపం, పరస్పరం బడాయి చెప్పుకొని గర్వించడం, సంతానం, సిరిసంపద లలో ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నించడం తప్ప మరేమీ కాదు. ఐహిక జీవితాన్ని ఇలా పోల్చవచ్చు: వర్షంతో ఎదిగిన మొలకల్ని చూసి రైతులు సంబర పడిపోతారు. తర్వాత ఆ పొలం పంటకు వచ్చి ఎర్రబారడం కన్పిస్తుంది. ఆ తర్వాత తుప్పగా (గడ్డి పరకలుగా) మారి పోతుంది.

అయితే పరలోకంలో (అవిశ్వాసుల కోసం) తీవ్రమైన యాతనలు, (విశ్వాసుల కోసం) అల్లాహ్ మన్నింపు- ఆయన ప్రసన్నతలు ఉంటాయి. ప్రపంచ జీవితం ఒక మాయ, భ్రాంతి తప్ప మరేమీ కాదు. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను విశ్వసించినవారి కోసం స్వర్గ సీమ సిద్ధంగా ఉంది. (కనుక) అల్లాహ్ మన్నింపు వైపు, భూమ్యాకాశాలంత విశాలమైన ఆ స్వర్గసీమ వైపు పోటీపడి పరుగెత్తండి. ఇది అల్లాహ్ అనుగ్రహం. ఆయన దాన్ని తాను తలచిన వారికి ప్రసాదిస్తాడు. అల్లాహ్ గొప్ప అనుగ్రహశాలి. (అల్ హదీద్ : 20-21)




# అమ్మో ఒకటో తారికు

- అయూబ్ బాషా

**ఒకటో తారీకు** వస్తుందంటే అందరికీ గుండెల్లో దడనే. పేద, మధ్యతరగతి ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేసేస్తుంది. గ్యాస్‌కు ఇంత, పాల వాడికి ఇంత, బియ్యానికి ఇంత, కూరగాయలకు ఇంత, వైద్య ఖర్చులకు ఇంత, ద్విచక్ర వాహన నెలసరి కంతు, కరెంటు బిల్లు, ఆ బిల్లు ఈ బిల్లు అని లెక్కలేసుకుంటే చుక్కలు కనపడుతుంటాయి. చివరికి మిగిలేది చిల్లి గవ్వ కూడా ఉండదు. కొన్ని కోట్ల మంది మధ్యతరగతి పేదల ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని, ఆన్‌లైన్‌లో లోన్ యాప్ ద్వారా కూడా అప్పుచేసి సకాలంలో కట్టలేక సతమతమయ్యేవారు ఎందరో. డిగ్రీ చదివిన ఆనందరావు ప్రైవేటు కంపెనీలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన నిజాయితీపరుడు. లౌక్యం లేదు. ఎంత సహనశీలుడో అంత ముక్కోపి, అందువల్ల ఎదగలేక పోతున్నాడు. వచ్చే జీతం ప్రతినెల 20వ తారీకు లోపల అయిపోతుంది. మరలా 10 రోజులు గడవడానికి అప్పు సప్పో తప్పడం లేదు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈయన అమ్మగారు కూడా ఉన్నారు. నాన్నగారు కాలం చేశారు. భార్య గృహిణి, పిల్లలను నానా కష్టం చేసి మంచి విద్యా సంస్థలలో చదివిస్తున్నారు. అబ్బాయి 12వ తరగతి అమ్మాయి 10వ తరగతి. ఓ రోజు తీరిగ్గా కూర్చుని ఒకటో తారీకు ఇవ్వాల్సిన అప్పులు, కట్టాల్సిన వడ్డీలు పునఃస్మరణ చేసుకుంటున్నారు. జీతానికి మించి పదివేలు ఎక్కువ ఖర్చులు వచ్చేలా ఉన్నాయి అని తెగ మదనపడుతున్నారు. అమ్మగారి వృద్ధాప్య పెన్షన్ కూడా ఇంటి అవసరాలకు ఇచ్చేవారు. భార్య ఈయన అమ్మగారు కూడా పూలు అల్లికలు చేసే పని చేసి కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవారు.

పక్కలో బల్లెం లాగా పిల్లలకు ఫీజు కట్టాలని వారి వారి విద్యా సంస్థల నుండి ఫోన్‌ల మీద ఫోన్లు వస్తున్నాయి. పిల్లలు తన లాగా కష్టపడకూడదు అని పగలనక రేయనక కష్టపడి ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివి స్తున్నారు. ఏమి చేయాలో పాలు పోక స్నేహితుడు అబ్దుల్ దగ్గర అప్పు కోసం సిద్ధమయ్యారు. అబ్దుల్ ఆ వీధిలోనే ఉన్న చిన్ననాటి స్నేహితుడు. కష్టమైనా, నష్టమైనా ఇద్దరు పాలుపంచుకుంటారు. ఇరువురి కుటుంబాలు రక్త సంబంధీకులు కలిసిపోయేవారు. అబ్దుల్ ఓ ప్రభుత్వ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నాడు. ఈయనకు సొంత ఇల్లు ఉంది. అబ్దుల్‌కి కూడా ఇద్దరు మగ పిల్లలు. వీరు కూడా ఆనందరావు పిల్లలు చదివే విద్యాసంస్థల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. అబ్దుల్‌తో అప్పుడప్పుడు అంటుండేవారు అనందరావు అమ్మగారు నా కొడుకు అమాయకుడు ఈ ఊసరవెల్లి లోకంలో ఎలా బతుకుతాడో ఏమో అని చాలా బాధపడే వారు. అబ్దుల్ దేవుడు ప్రతి ఒక్కరికి ఏదో ఒక దారి చూపిస్తాడు అని భరోసా ఇచ్చేవాడు. ఇది ఒక ఆనందరావు పరిస్థితి కాదు. కొన్ని కోట్ల మధ్యతరగతి కుటుంబం అవస్థలు. విద్యారంగం ప్రయివేట్, ఆరోగ్యం ప్రయివేట్, వైద్యం ప్రయివేట్, సంక్షేమ రాజ్యంలో సగటు మనిషికి అందని ఆకాశంలో ధరలు, ద్రవ్యోల్బణం. ఈ పరిస్థితిని మార్చుకోవలసింది ప్రజలే. ❖




## ఉర్దూ మీడియంలో చదివినా పరీక్షలు హిందీలోనే రాయాలి

బోర్డు పరీక్షలను హిందీ, ఇంగ్లీషు భాషల్లోనే రాయాలంటూ సీబీఎస్ఈ జారీ చేసిన ఆదేశాలు ఉర్దూ మీడియం స్కూల్స్‌కు తలనొప్పిగా మారాయి. హిందీ, ఇంగ్లీషులో కాకుండా ఇతర భాషలలో బోర్డు పరీక్షలు రాయటానికి అనుమతించకూడదని సీబీఎస్ఈ తీసుకున్న నిర్ణయంపై మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ)లోని మూడు ఉర్దూ మీడియం పాఠశాలలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హైదరాబాద్, హర్యానా, దర్భంగాలోని మనూ 'మోడల్ స్కూల్స్' ఉర్దూలో విద్యను అందిస్తున్నాయి. ఈ పాఠశాలలు సీబీఎస్ఈకి అనుబంధంగా ఉన్నాయి. బోర్డు అనుమతి లేకుండా హిందీ, ఇంగ్లీష్‌లలో కాకుండా ఇతర భాషల్లో జవాబు పత్రాలు రాసి ఉంటే వాటిని మూల్యాంకనం చేయరాదని సీబీఎస్ఈ పాలక మండలి జూన్‌లో నిర్ణయించింది. గత మూడేండ్లుగా, ప్రశ్నపత్రాలను ఆంగ్లం, హిందీలో పంపినప్పటికీ.. విద్యార్థులు ఉర్దూలోనే సమాధానాలు రాయటం కొనసాగించారు. అయితే, సీబీఎస్ఈ తాజా నిర్ణయంతో విద్యార్థులు ఇకపై ఉర్దూలో సమాధానాలు రాయటానికి వీలుండదు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

## కూల్చివేతలు ఆపండి

కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దుందుడుకుగా బుల్డోజర్లతో కూల్చివేతలకు పాల్పడుతుండటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆక్రమణల తొలగింపు పేరుతో సాగిస్తున్న ఈ బుల్డోజర్ జస్టిస్‌ను అక్టోబర్ 1 వరకు ఆపాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. నిందితుల ఆస్తులతో సహా ఎటువంటి ఆస్తినీ తన అనుమతి లేకుండా కూల్చవద్దని స్పష్టం చేసింది. చట్టవిరుద్ధంగా కనీసం ఒక ఇంటిని కూల్చివేయడమైనా అది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని స్పష్టం చేసింది. అయితే, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే లైన్లు, చెరువులు వంటి బహిరంగ ప్రదేశాల్లోని అనధికారిక నిర్మాణాలకు ఈ ఆదేశాలు వర్తించబోవని తెలిపింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ఈ ఆదేశాలను ఇచ్చింది. చాలా రాష్ట్రాల్లో ఇళ్లు, ఇతర భవనాలను చట్టవిరుద్ధంగా కూల్చేస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను జారీ చేసింది.

## శ్రీ విజయపురంగా పోర్టు బ్లెయిర్

అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్‌బ్లెయిర్ పేరు శ్రీ విజయపురంగా మారింది. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. దేశంలో వలస పాలన తాలూకు ఆనవాళ్లను తుడిచివేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పోర్ట్‌బ్లెయిర్ పేరులో బ్రిటీష్ వారసత్వం ప్రతిబింబిస్తోందని, స్వాతంత్ర్యం సిద్ధించడంలో ఈ ప్రాంతం కీలక భూమిక వహించినందున విజయానికి ప్రతీకగా 'శ్రీ విజయపురం' అనే పేరును ఖరారు చేశామని పేర్కొన్నారు. చారిత్రక ప్రశస్తి కలిగిన ఈ ప్రాంతం... చోళుల కాలంలో నావికా స్థావరంగా ఉండేదని, ఇప్పటికీ దేశ వ్యూహాత్మక స్థావరంగా ఉపయోగపడుతోందన్నారు.

## జమిలి ఎన్నికలు ఆచరణాత్మకం కాదు

దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. ఈ విధానం ఆచరణాత్మకం కాదని, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, సమాఖ్య విధానానికి వ్యతిరేకమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. మోదీ ప్రభుత్వం అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. జమిలి విధానాన్ని దేశం అంగీకరించబోదని పేర్కొన్నారు. 'ఒక దేశం.. ఒకేసారి ఎన్నికలు' అంశం బీజేపీ మరో చౌకబారు ఎత్తుగడ అని టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ విమర్శించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటున్న బీజేపీ.. ప్రస్తుతం హరియాణా, జమ్మూ కశ్మీర్‌తో పాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలను ఒకేసారి నిర్వహించలేని కేంద్రం జమిలి పాట పాడుతోందని శివసేన (యూబీటీ) విమర్శించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రాల హక్కులను హరిస్తుందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా ఆందోళన వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలు సమాఖ్య విధానాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తాయని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. రాష్ట్రాల్లో వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరగడం వల్ల ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తప్ప ఎవరికీ ఎలాంటి సమస్య లేదని వ్యాఖ్యానించారు. దేశాన్ని ఎప్పటికీ తామే పాలించాలని ఆరాటపడుతున్న బీజేపీ జమిలి ఎన్నికల కోసం ప్రయత్నిస్తోందని జేఎంఎం విమర్శించింది.

సర్వత్రా

## బ్రిటీష్ దౌత్యవేత్తలపై రష్యా బహిష్కరణ వేటు

గూఢచర్యానికి పాల్పడిన ఆరుగురు బ్రిటీష్ దౌత్యవేత్తలను రష్యా బహిష్కరించింది. బ్రిటన్ ఎంబసీ సిబ్బంది గూఢచర్యం, విధ్వంసకర కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌బి) పేర్కొంది. రష్యా సుస్థిరతకు విఘాతం కలిగిస్తూ, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు రెచ్చగొట్టే కార్యకలాపాల్లో బ్రిటన్ చురుకుగా పాల్గొంటోందని విమర్శించింది. ఈ మేరకు ఎఫ్ఎస్‌బి ఒక ప్రకటన జారీ చేసింది. అంతర్జాతీయ సైనిక-రాజకీయ పరిస్థితులను రెచ్చగొట్టడంలో లండన్ పాత్రను ధృవీకరిస్తూ తమకు కొన్ని పత్రాలు లభించాయని తెలిపింది. అలాగే రష్యాను వ్యూహాత్మకంగా ఓడించే ప్రయత్నంలో భాగంగా రష్యాలో విధ్వంసకర విధానాలకు బ్రిటన్ మద్దతిస్తోందని పేర్కొంది.

## వివాదాలకు చర్చలే పరిష్కారం

ఉక్రెయిన్, గాజా వివాదాలకు చర్చలే పరిష్కారం అని చైనా రక్షణ మంత్రి డాంగ్ జున్ అన్నారు. "ఉక్రెయిన్‌లో సంక్షోభం, ఇజ్రాయెల్- పాలస్తీనా వివాదం వంటి హాట్‌స్పాట్ సమస్యలను పరిష్కరించడానికి, శాంతి చర్చలను ప్రోత్సహించడం ఒక్కటే మార్గం. యుద్ధం, సంఘర్షణలో విజేతలు ఎవరూ ఉండరు, ఘర్షణతో ఫలితం ఏమీ ఉండదు" అని డాంగ్ అన్నారు. "శాంతి యుత అభివృద్ధి, సమ్మిళిత పాలన"ను ప్రోత్సహించాలని అన్ని దేశాలకు ఆయన పిలుపునిచ్చారు. సంఘర్షణ ఎంత తీవ్రంగా వున్నా మనం సంప్రదింపులను వదులుకోకూడదు. ఏదైనా సంఘర్షణకు అంతిమంగా ముగింపు సయోధ్యలోనే ఉంటుంది. డాంగ్ ప్రకారం, ప్రాంతీయ ఉద్రిక్తతలను పరిష్కరించడానికి, పొరుగు దేశాలు "ఐక్యత ద్వారా బలాన్ని వెతకాలి". ప్రపంచ స్థాయిలో, దేశాలు "ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోకూడదు, ఇతర దేశాల హక్కులు, ప్రయోజనాలను ఎప్పుడూ ఉల్లంఘించకూడదు." "ప్రపంచ భద్రతను పరిరక్షించడంలో ప్రధాన దేశాలు ముందుండాలి. జీరో-సమ్ మైండ్‌సెట్‌ను విడిచిపెట్టాలి. చిన్న, బలహీనులను బెదిరించడం మానుకోవాలి'' అని ఆయన ఒక కార్యక్రమంలో అన్నారు.

## రష్యా మీడియా సంస్థలపై మెటా నిషేధం

రష్యా టుడే (ఆర్‌టి), రష్యన్ మీడియా నెట్‌వర్క్‌లను నిషేధిస్తున్నట్లు ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ప్రకటించింది. విదేశీ జోక్యం చర్యపై క్రెమ్లిన్ నియంత్రిత నెట్‌వర్క్‌లను నిషేధించినట్లు పేర్కొంది. "సునిశితంగా పరిశీలించిన తర్వాత .. మేము రష్యా మీడియా సంస్థలపై కొనసాగుతున్న అమలును విస్తరించాము" అని మెటా ప్రతినిధి ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌టి న్యూస్, రోసియా సెగోడ్న్యా, ఇతర సంస్థలు మోసపూరిత కార్యకలాపాలలో పాల్గొంటున్నాయని ఆరోపించారు.

## తన పౌరులను తానే చంపుతున్న ఇస్రాయిల్

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి తన సొంత ప్రజలు కూడా బలైపోతున్నారు. ప్రపంచ దేశాలన్నీ దాడులు ఆపేయాలని కోరినా.. అమెరికా, యూరప్ దేశాల అండదండలతో మితవాద ప్రధాని నెతన్యాహూ ప్రభుత్వం గాజాపై అమానవీయ దాడులకు తెగబడుతూనేవుంది. వైమానిక దాడులతో విరుచుకుపడుతూ నిత్యం వేలాది మంది అమాయక పాలస్తీనియన్లను బలి తీసుకుంటోంది. వీరిలో అత్యధిక మంది చిన్నారులూ, మహిళలే కావడం దుర్మార్గం. కాగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడుల్లో తన సొంత పౌరులను కూడా బలితీసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలస్తీనా సాయుధ బలగాల చేతిలో బందీలుగా ఉన్న ఇజ్రాయిల్ పౌరుల్లో గతేడాది నవంబరులో ముగ్గురు చనిపోయినట్లు నెతన్యాహూ ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. అయితే ఆ ముగ్గురు కూడా ఇజ్రాయిల్ సైన్యం గాజాపై జరిపిన క్షిపణిదాడుల వల్లే చనిపోయారని నెతన్యాహూ సైన్యం ప్రకటించింది.

## ఏడాది లోగా ఆక్రమిత ప్రాంతాల నుండి వెళ్లిపోండి!

ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో చట్టవిరుద్ధంగా వుండడాన్ని 12మాసాల్లోగా నిలుపు చేయాలని డిమాండ్ చేస్తూ పాలస్తీనా రూపొందించిన తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించనుంది. పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ ఆక్రమణలు, అక్రమ ఆవాసాల నిర్మాణం అంతా చట్టవిరుద్ధమని, అక్కడ నుండి వెంటనే వైదొలగాలని జులైలో అంతర్జాతీయ న్యాయస్థానం పేర్కొంది. ఆ తీర్పును ముసాయిదా తీర్మానం స్వాగతించనుంది. సాధ్యమైనంత త్వరగా ఈ తీర్పును అమలు చేయాలని కోరింది. జనరల్ అసెంబ్లీ ముసాయిదా తీర్మానం మాత్రం 12 మాసాల గడువును ఇస్తోంది. ఈ నెల్లో పాలస్తీనాకు అదనపు హక్కులు, బాధ్యతలు లభించిన నేపథ్యంలో మొదటి సారిగా పాలస్తీనా అథారిటీ లాంఛనంగా ఈ ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. అసెంబ్లీ హాల్‌లో ఐక్యరాజ్య సమితి సభ్యుల మధ్య ఒక సీటును పాలస్తీనాకు కేటాయించడంతో పాటూ ముసాయిదా తీర్మానాలు ప్రతిపాదించే హక్కు కూడా పాలస్తీనాకు లభించింది. "ప్రతి దేశానికి ఒక ఓటు వుంది. యావత్ ప్రపంచం మనల్ని వీక్షిస్తోంది." అని పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ వ్యాఖ్యానించారు. మంచి చరిత్ర వైపు నిలబడండి. అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా వ్యవహరించండి. స్వేచ్ఛా, శాంతిలతో జీవించండి'' అని వ్యాఖ్యానించారు.

# దైవ ప్రేమ, ప్రవక్త ప్రేమ – విడదీయరానివి

ముహమ్మద్ వహీదుద్దీన్

**అంతిమ** సందేశహరులు ముహమ్మద్ (స) సందేశం కేవలం ఒక ప్రత్యేక జాతికో, ఒక ప్రత్యేక భాషకో, ఒక ప్రత్యేక ప్రాంతానికో, ఒక ప్రత్యేక కాలానికో పరిమితమైంది కాదు. ఆ సందేశం సార్వజనీనమూ, సార్వకాలికమూ అయి సర్వమానవాళి కోసం అవతరించింది. అందువలన ఆయన మార్గాన్ని అనుసరించడం అత్యంత ఆవశ్యకం. ఆయన జీవితాన్ని ఏ కోణాన్నుంచి పరిశీలించినా, ఏ రంగంలో తిలకించినా మనకు పరిపూర్ణత గల వ్యక్తిత్వం దర్శనమీయగలదు. మానవత్వం మూర్తీభవించిన మహా మనీషిగా, నిజాయితీపరుడైన మహనీయుడిగా, సకలగుణశోభితుడైన సౌశీల్యవంతుడుగా, సత్య సంధుడుగా, అనాథుల పాలిట ఆత్మబంధువుగా, వికలాంగుల పాలిట కరుణా సముద్రుడుగా, వితంతువుల పాలిట శ్రేయోభిలాషిగా, పసి హృదయాల ఎడల ప్రేమ మూర్తిగా, పీడిత ప్రజల పెన్నిధిగా, పొరుగువారి ఎడల పరోపకారిగా ప్రజలందరి ఆదరాభిమానాలు చూరగొన్న దయా సముద్రుడాయన.

మహనీయ ముహమ్మద్ (స) గారిని అల్లాహ్ కడపటి దైవ ప్రవక్తగా ప్రభవింపచేశాడు. ఆయన అజ్ఞానాంధకారంలో నున్న మానవాళిని తమ జ్ఞాన జ్యోతులచే వెలుగు చూపారు. మంచి చెడుల విచక్షణా జ్ఞానాన్ని బోధించారు. సజ్జనుల కోసం స్వర్గ శుభవార్తను అందించారు. ప్రతి ఒక్కరూ జీవితంలోని ప్రతి సంఘటనల్లోనూ దైవప్రవక్త (స) బోధనలనే అనుసరించాలి. తమ సమస్యలన్నింటినీ దివ్య ఖుర్ఆన్, హదీసుల (ప్రవక్త ప్రవచనాలు) వెలుగులోనే చూడాలి. ఆచరించాలి. వీటికి భిన్నంగా నడుచుకునే వారు నిజమైన విశ్వాసులు కారు అని తెలియచేస్తున్నాయి. దివ్య ఖుర్ఆన్ "విశ్వాసులారా! మీరు దేవుని పట్ల, ఆయన ప్రవక్త పట్ల పూర్తి విధేయత కలిగి ఉండండి. సత్యాన్ని, దైవ ధర్మాన్ని (గురించి) వింటూనే మీరు అవిధేయతకు పాల్పడకండి". అని హెచ్చరిస్తున్నది.

చివరి ప్రవక్త (స) మన మధ్య లేకున్నా ఆయన మన కోసం విడిచి వెళ్లిన ఖుర్ఆన్, హదీసులు సజీవంగా వున్నాయి. నేటికీ ఇవే ఇస్లాంకు ప్రాతిపదికలు. వీటిని అనుసరించడంలోనే మానవులకు సుఖ శాంతులు, అభివృద్ధి ఇమిడి వున్నాయి. ప్రవక్త(స)పై, దివ్య ఖుర్ఆన్‌పై నిశ్చలమైన ప్రేమ ఉందని చెప్పుకోవడం ఆషామాషీ విషయం కాదు. ఆ ప్రేమను మానవుడు తన జీవితంలోని అన్ని రంగాల్లో ఆచరణాత్మకంగా వ్యక్తపరచుకొన్నపుడే అతడు విశ్వాసిగా విరాజిల్లగలడు. మహాప్రవక్త (స) ఎంతో క్షమాగుణం కలవారు.


దేవుని ప్రేమ, ప్రవక్త ప్రేమ ఒక దానికొకటి అవినాభావ సంబంధమైన విషయాలు. ప్రవక్తను ప్రేమించలేని వారు దేవుని ప్రేమకు దూరమై పోతారు. ప్రవక్తను ప్రేమించడం అంటే ఆయన బోధనలను, హితోక్తులను తప్పనిసరిగా పాటించడమే.

అంతేకాని ప్రవక్తను ప్రేమిస్తున్నానని నోటితో చెప్పడం వల్ల ఏ మాత్రం ప్రయోజనం ఉండదు. ఒకసారి దైవప్రవక్త(స) హజ్రత్ ఉమర్ (రజి) చేతిని తమ చేతిలోకి తీసుకున్న సమయంలో హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అంటారు: "దైవప్రవక్తా! (స) నా ప్రాణం తప్ప మిగతా అన్ని విషయాలకన్నా మీరే నాకు ఎంతో ప్రియమైన వారు? దైవప్రవక్త (స) ఈ మాటలు విని "కాదు, కాదు, ఎవరి ఆధీనంలో నా ప్రాణం ఉందో ఆ దైవం సాక్షిగా చెబుతున్నాను. మీకు నేను మీ ప్రాణం కన్నా అధికంగా ప్రియమైన వాణ్ణి కానంత వరకు మీరు విశ్వాసులు కాలేరు" అని చెప్పారు.

ఈ మాటలకు హజ్రత్ ఉమర్ (రజి) "అయితే ఇప్పుడు నా ప్రాణం కన్నా మీరే నాకు అత్యంత ప్రియమైన వారు" అని చెప్పారు. అది విని దైవ ప్రవక్త ''ఉమర్ ఇప్పుడయితే సరే (నీవు (విశ్వాసివే))" అని చెబుతారు.

అందువలన ప్రవక్త (స) పై ప్రేమ ఉందని చెప్పుకోవడం సాధారణ విషయం కాదు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని నడవాలి. ప్రవక్త చూపిన మార్గంలో అనేక కష్టాలు ఎదురుకావచ్చు. వాటన్నింటిని సహిస్తూ ముందుకు సాగాలి. అప్పుడే శుభాలు సంక్రమిస్తాయి.

తుదిగీటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**